# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 236 | విశాఖపట్నం | 27-5-2026 బుధవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 236 | VISAKHAPATNAM | 27-5-2026 WEDNESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram





## స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యాలపై

# సీఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ నారా చంద్రబాబు నాయుడు మంగళవారం అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ అనుబంధ రంగాలపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. 'స్వర్ణాంధ్ర విజన్ 2047'లో భాగంగా ప్రాథమిక రంగ అభివృద్ధికి సంబంధించిన ఆరు కీలక మిషన్లపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, సీఎస్ సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, కార్పొరేషన్ చైర్మన్లు హాజరయ్యారు. వ్యవసాయం, హార్టికల్చర్, ఆక్వాకల్చర్, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖల పనితీరు, భవిష్యత్తు కార్యాచరణపై సీఎం చంద్రబాబు చర్చించారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నమోదవుతున్న వర్షపాతం పరిస్థితులు, సాగునీటి లభ్యత, రైతులకు విత్తనాల పంపిణీ, పంటల ప్రణాళిక వంటి అంశాలపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా వ్యవసాయ రంగంలో సాంకేతికత వినియోగం, ఉత్పాదకత పెంపు, మార్కెటింగ్ సౌకర్యాల విస్తరణ, ఎగుమతుల అవకాశాలపై కూడా సమావేశంలో చర్చించారు. రైతుల ఆదాయం పెంచే దిశగా ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందని అధికారులు వెల్లడించారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా వ్యవసాయ అనుబంధ రంగాలను బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానం అందరికీ పూర్తిగా అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో నిబంధనల పేరుతో ఫైళ్లను నిలిపివేయడం ఆమోదయోగ్యం కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వ పరిపాలన వేగాన్ని పెంచే లక్ష్యంతో (తరువాయి 2వ పేజీలో)

## గోదావరిలో కాలుష్య నివారణకు

# ప్రత్యేక చర్యలు : పవన్

**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** దావరి నదిలో కాలుష్యాన్ని తగ్గించడమే లక్ష్యంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు ప్రకటించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేరుగా రంగంలోకి దిగారు. రెండో రోజు పర్యటనలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆంధ్ర పేపర్ మిల్స్ కాలుష్యాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఉదయాన్నే వెంకట నగరం ప్రాంతం నుంచి గోదావరి మధ్యన ఉన్న లాగూన్స్ (మడుగులు) వరకు బోటులో వెళ్లి తనిఖీ చేశారు. పేపర్ మిల్స్ యాజమాన్యం తూర్పులంకలోని ప్రత్యేక మడుగుల్లో కాలుష్యకారక నీటిని విడిచిపెడుతున్న వైనాన్ని పరిశీలించారు. ఏ మేరకు శుద్ధి చేసి అక్కడ విడిచి పెడతారు? ఆ ప్రాంత జలాల్లో ఉన్న కాలుష్యం ఎంత అన్న విషయాలను ప్రత్యక్షంగా వెళ్లి తెలుసుకున్నారు. మట్టి, నీటి నమూనాలను సేకరించి అక్కడే మొబైల్ కిట్స్ ద్వారా పరీక్షలకు జరిపించారు. కాలుష్యకారకాలు ఉన్నట్లు గుర్తించి, నిబంధనలను పాటించనందున వెంటనే పరిశ్రమకు నోటీసులు జారీ చేయాలని




ఆదేశాలు జారీ చేశారు. మడుగుల్లో గుర్రపు డెక్క పేరుకుపోయిన తీరుపై పీసీబీ అధికారులను పవన్ ప్రశ్నించారు. పరిశ్రమలకు రాయితీలపై భూములు ఇచ్చి ప్రోత్సహిస్తుంటే కనీసం పర్యావరణ స్పృహ కూడా లేకపోతే ఎలా (తరువాయి 2వ పేజీలో)

## ఎక్కడా జాడ లేని నైరుతి రుతుపవనాలు.. ఐఎండీ అంచనా తప్పింది!



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశవ్యాప్తంగా రైతులు, ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నైరుతి రుతు పవనాల రాక ఆలస్యం కానుంది. మే 26న కేరళ తీరాన్ని తాకుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముందుగా అంచనా వేసినప్పటికీ, అందుకు అనువైన పరిస్థితులు ఇంకా ఏర్పడలేదని తెలుస్తోంది. దీంతో రుతుపవనాలు సాధారణ తేదీ అయిన జూన్ 1 కంటే కొద్దిగా ఆలస్యంగా, అంటే జూన్ 2 నుంచి 4 మధ్య కేరళలోకి ప్రవేశించే అవకాశం ఉందని ఐఎండీ తాజా అంచనాలు సూచిస్తున్నాయి.




### ఎబోలా వైరస్ ఎఫెక్ట్.. విజయవాడ విమానాశ్రయంలో స్క్రీనింగ్ పరీక్షలు




### టీడీపీ సరికొత్త మహానాడుకు సర్వం సిద్ధం: పల్లా




### గర్భధారణ సమయంలో డయాబెటిస్ వస్తే అది దేనికి సంకేతం?






## మా కుమార్తె కేసులో న్యాయం చేయండి..

# జగన్‌ను వేడుకున్న సుగాలి ప్రీతి తల్లిదండ్రులు



**తాడేపల్లి, పతాకం న్యూస్:** గత తొమ్మిదేళ్లుగా తమ కుమార్తె కేసులో న్యాయం కోసం పోరాడుతున్న సుగాలి ప్రీతి తల్లిదండ్రులు పార్వతి, రాజు నాయక్‌లు వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ ను కలిసి తమ ఆవేదనను పంచుకున్నారు. 2017లో తమ కుమార్తెపై అత్యంత దారుణంగా అత్యాచారం చేసి, హత్య చేశారని.. ఇన్నేళ్లు గడుస్తున్నా తమకు ఇంకా న్యాయం జరగలేదని వారు జగన్ ఎదుట కన్నీరు పెట్టుకున్నారు. ఆనాడు వైసీపీ ప్రభుత్వం తమ కుటుంబానికి కర్నూలులో 5 సెంట్ల ఇంటి స్థలం, 5 ఎకరాల వ్యవసాయ భూమితో పాటు ప్రీతి తండ్రికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అండగా నిలిచిందని చెప్పారు. అయితే, ప్రస్తుతం ఈ కేసును పూర్తిగా పక్కనపెట్టేశారని ఆరోపించారు. అంతేకాకుండా, తమకు రావాల్సిన పెన్షన్‌ను కూడా స్థానిక అధికారులు నిలిపివేశారని, కేటాయించిన స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు సాయం అడిగినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జగన్ దృష్టికి తీసుకెళ్లారు. సీబీఐ విచారణ వేగవంతమయ్యేలా తమకు న్యాయ సహాయం అందించాలని వారు కోరారు. సుగాలి ప్రీతి కుటుంబానికి అన్ని విధాలా న్యాయ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

## కరెంట్ సమస్యల పరిష్కారానికి

# టోల్ ఫ్రీ నెం.1912: గొట్టిపాటి



**అమరావతి. పతాకం న్యూస్:** రాష్ట్రంలో ఎక్కడ కరెంట్ సమస్య తలెత్తినా పరిష్కారానికి 1912 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోకి తెస్తున్నామని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వ్యాఖ్యానించారు. వాతావరణ మార్పులతో పలుచోట్ల విద్యుత్ అంతరాయం తలెత్తుతున్న మాట వాస్తవమేనని పేర్కొన్నారు. ఏపీలో అక్కడక్కడా తలెత్తుతున్న విద్యుత్ అంతరాయాలను ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో మీడియాతో మంత్రి గొట్టిపాటి మాట్లాడారు. 48 డిగ్రీలకుపైగా పగటి ఉష్ణోగ్రతలు, సాయంత్రం ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. ఎక్కడైనా ఒక ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరించటానికి కనీసం 2 నుంచి 4 గంటల సమయం పడుతుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. అధిక ఉష్ణోగ్రతలోనూ ప్రాణాలు పణంగా పెట్టి విద్యుత్ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండి పనిచేస్తున్నారని చెప్పారు. సత్తెనపల్లిలో ఇద్దరు సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తూ ప్రాణాలు మీదకు తెచ్చుకున్నారని.. ప్రజలు వాస్తవాలు అర్థం చేసుకోవాలని అన్నారు.

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## దాడి..

గత వారం రోజులలోనూ తెలుగు రాష్ట్రాల రాజకీయాలలో వివాదాలు, విద్వేష దూషణలూ పరాకాష్టకు చేరాయి. అధికారంలో వున్న కోల్వోయిన పాలక పార్టీల కీలక నేతలు మాజీ ప్రస్తుత ముఖ్యమంత్రులేగాక కేంద్రంలో పాలిస్తున్న బిజెపి-ఎన్‌డిఎ మంత్రులు కూడా ఈ వివాదాలకు ప్రత్యక్ష పరోక్ష కారకులు కావడం విశేషం. ప్రధాని నరేంద్ర మోడీ హైదరాబాద్‌లో సభకు హాజరై ఎ.పి ముఖ్యమంత్రినీ ఉపముఖ్యమంత్రినీ కలిసి వెళ్లిన వెనువెంటనే ఈ పరిస్థితి రావడం యాదృచ్ఛికం కాదు. ఈ వివాదాలలో బయటి పరిణామాలు మాత్రమేగాక పాలక పార్టీలు అంతర్గతంగానూ మల్లగుల్లాలు పడవలసిన పరిస్థితి మరింత ప్రాధాన్యత కలిగింది. ఈ క్రమంలో పదవులు, ఉద్వాసనలూ, పొత్తులూ, ఎత్తులూ అన్నిటిపై ప్రశ్నలు ఎదురవుతున్నాయి. వేల కోట్ల రూపాయల విలువైన ప్రజా ధనంతో నడిచే నిర్మాణాలూ, ప్రాజెక్టులూ, కేటాయింపులు కూడా సందేహాలకు గురవుతున్నాయి. ప్రస్తుత మీడియా స్వభావరీత్యానే ఈ విధమైన మౌలిక సమస్యలు వదిలేసి పరస్పర వివాదాలు, పార్టీల తగాదాలకు పెద్ద పీట వేస్తుంటే నిజమైన సమస్యలపై కేంద్రీకరణ, ప్రజల ఆస్తుల రక్షణ, ప్రజాస్వామ్య లౌకిక విలువల పరిరక్షణ వంటి అంశాలు వెనక్కు పోతున్నాయి. ప్రధాన మంత్రి సభ నాటికే కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసుపై తెలంగాణ రగిలి పోతున్నది. చాలా కాలం కిందటే బాధితురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా పోలీసులు త్వరితంగా రంగంలోకి దిగలేదు. పైగా సదరు మంత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రధాని పాల్గొన్న సభలలోనే పాల్గొనగలిగారు. ప్రధాని పర్యటన సందర్భంగా బిజెపి సభలోనైతే సంజయ్ మాట్లాడుతూ తన కుటుంబంపై కుట్రలు జరుగుతున్నాయని ఎదురు దాడి కూడా చేశారు. అప్పటికే పోక్సో కేసుపై అలజడి పెరగడంతో రేవంత్ రెడ్డి పోలీసులకు ఆదేశాలిచ్చినట్టు వార్త ప్రసారమైంది. ప్రధాని పర్యటన భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమైన కారణంగా ఈ కేసుపై దృష్టి పెట్టలేకపోయామని డిజిపి వివరణ ఇచ్చారు. అయితే తర్వాత కూడా రెండు మూడు రోజుల దాకా ఏ చర్య లేదు సరికదా కేంద్రమంత్రి 'ఏక్తా యాత్ర' అంటూ జరిపి అక్కడ 'జై శ్రీరాం' నినాదాల మధ్య తనను తాను సమర్థించుకుంటూ విమర్శకులకు హెచ్చరికలు చేశారు. భక్తి పేరిట జరిపిన యాత్రలో పోక్సో కేసు సమర్థనలతో మాట్లాడటం బిజెపి అభిమానులే జీర్ణించుకోలేకపోయిన పరిస్థితి, ఇదే సమయంలో అతన్ని ముఖ్యమంత్రి ఇంట్లోనే దాచి వుంచారని బి.ఆర్.ఎస్ నాయకులొకరు ఆందోళన చేయబోయి అరెస్టయ్యారు. ఈ ఘటనలో బాధితురాలు మైనర్ కాదంటూ విపరీతంగా పోస్టులు, ట్రోల్స్ గుప్పించారు. కొందరు మహిళా యూ ట్యూబర్లతో సహా సోషల్ మీడియా, కొన్ని ఛానళ్లు బండిని వెనకేసుకొచ్చే ప్రయత్నం చేశాయి. కె.సి.ఆర్ కుటుంబానికి బండి సంజయ్‌కి కూడా స్వంత జిల్లా అయిన కరీంనగర్‌లో దీనిపై రెండు పార్టీల మధ్య తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. చివరకు హైకోర్టు బెయిల్ నిరాక రించాకగానీ భగీరథ్ అరెస్టు కాలేదు. భగీరథ్‌ను అరెస్టు చేశామని పోలీసులు చెబుతుంటే తానే అప్పగిం చానని సంజయ్ చెప్పుకున్నారు. చివరకు ముఖ్యమంత్రి కూడా దీన్ని ఖండించవలసి వచ్చింది. అయితే మైనర్ బాలికకు సంబంధించిన విషయంలో తాము జాగ్రత్త తీసు కుంటే బి.ఆర్.ఎస్ మాత్రం ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించనట్టు రాజకీయ స్వార్థంతో దాడి చేస్తున్నదని కూడా ముఖ్యమంత్రి విమర్శించారు. బిజెపితో బి.ఆర్.ఎస్ కే సంబంధా లున్నాయని, అందుకే కాళేశ్వరం తప్పులపై ఎలాంటి చర్యకు సిద్ధం కాలేదని కాంగ్రెస్ ఆరోపణ, కాంగ్రెస్ కావాలనే కె.సి.ఆర్ పై తీవ్రమైన ఆరోపణలను పక్కనపెట్టి వేరే వాటిపై విచారణ తతంగాలు జరుపుతున్నదని బిజెపి ఎదురు దాడి. ప్రధాని పర్యటనలో ముఖ్యమంత్రిని మాతో కలవండని పిలుపు నివ్వడంపైనా చాలా చర్చలు నడిచాయి. బి.ఆర్.ఎస్ తీవ్రమైన కుమ్మక్కు ఆరోపణలు చేస్తుంటే ముఖ్యమంత్రి తేలిగ్గా తోసిపుచ్చారు. మొన్నటి దఫా ఎన్నికల తర్వాత తెలంగాణ తమ టార్గెట్ అంటూ హడావుడి చేస్తున్న బిజెపికి బండి సంజరు వివాదం నష్టదాయకమని ఆయనను పదవి నుంచి తప్పించాలని ఆ పార్టీలోనే ముసలం పుట్టిన సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తప్ప ప్రముఖ నేతలెవరూ దీనిపై పెద్దగా స్పందించడం లేదు. బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి గతంలో చేసినట్టు రేవంత్ రెడ్డి తమ పార్టీ నేతలతో టచ్‌లో వుండొచ్చని ఆ పార్టీ ఎంపి ధర్మపురి అర్వింద్ సెలవిచ్చారు. బి.ఆర్.ఎస్ ఎ.పి లో వైసిపి నేత జగన్‌తో కలసి పని చేస్తున్నదని ఒకవైపు, రేవంత్ రెడ్డి గత సంబంధాలను బట్టి చంద్రబాబుకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మరోవైపు కథనాలు సాగుతూనే వున్నాయి. బి.జె.పి-ఆర్.ఎస్.ఎస్ ల మత రాజకీయాలు, ఇటీవల కాంగ్రెస్‌కు మళ్లీ చేరువైన మజ్లిస్ నేతల మత పాచికలు తరచూ ప్రభావం చూపిస్తున్నాయి. వీటన్నిటి మధ్యనా కార్మికుల పోరాటాలు, విద్యా వైద్య సమస్యలు, పేరుకుపోయిన బకాయిలు వంటివి తెర మరుగైపోతున్నాయి. రాజధాని శివార్లలో మంచిరేవుల మహేశ్వరం వంటి చోట్ల భూమి స్కాములు జరిగాయనే పోటాపోటీ కథనాల మధ్య తాజాగా ఇ.డి కూడా విచారణ జరిపింది. అధికార పార్టీలోనూ విభేదాల కథలు కూడా షరామామూలే. అడపాదడపా ప్రకటనలు మినహాయిస్తే కాంగ్రెస్ తన ప్రధాన జాతీయ ప్రత్యర్థి అయిన బిజెపి మత రాజకీయాలపై, కేంద్రం పెత్తనంపై గట్టిగా కార్యక్రమాలు తీసుకున్నది నామమాత్రమే. 2034 వరకూ అంటే వచ్చే ఎన్నికల తర్వాత మరో దఫా కూడా తనే అధికారం చేపట్టి ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లోకి పోతానన్నది రేవంత్ మాట. వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి బెంగళూరు మకాం మార్చి మళ్లీ లోటస్ పాండ్‌కు రానున్నారనే వార్తలు కూడా దీంతో పాటే వినిపిస్తున్నాయి. సన్నిహితులుగా పేరున్న కొంతమంది మంత్రులతో సంబంధాలు నెరపడమేగాక సమీకరణలకు తోడవుతున్నా రనేది ఆయనపై పరిశీలకుల వ్యాఖ్య.

## చేపల కోసం చెరువు నీరు వృథా..



**కర్నూలు, పతాకం న్యూస్:** చేపల పెంపకందారులు కొండమాయపల్లె చిన్నరాజచెరువు తూములను అనధికారరంగా ఎత్తి నీటిని విడుదల చేశారు. దీంతో విలువైన నీరు వృథా అయి, గ్రామమంతా చిత్తడిగా మారింది. చేపలు పట్టుకోడానికే ఇలా చేసినట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం చేపలను వలలు వేసి పట్టుకోవాలే ఆని ఇలా తూములు ఎత్తకూడదు. ముందే నీటి ఎద్దడి ఉండగా ఇలా వృథాచేయంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవంపై విమర్శలు వస్తున్నాయి. జిల్లా అధికారులు స్పందించి, నీటి వృథాను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## దేశ వ్యాప్తంగా మరోసారి సీఎన్‌జీ ధరల పెంపు..



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశవ్యాప్తంగా కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ) ధరలను చమురు మార్కెటింగ్ సంస్థలు మరోసారి పెంచాయి. కిలోకు రూ.2 చొప్పున ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. తాజా పెంపు మంగళవారం నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో దేశ రాజధాని దిల్లీలో కేజీ సీఎన్జీ ధర రూ.83.09కు చేరింది. గత 15 రోజుల వ్యవధిలో ఇది నాలుగోసారి ధరల పెంపు కావడం గమనార్హం. ఇప్పటికే మే 15న కిలోకు రూ.2, మే 18న రూ.1, మే 23న మరో రూ.1 చొప్పున జచీ+ ధరలు పెరిగాయి. తాజా పెంపుతో కలిపి గత 11 రోజుల్లోనే కేజీ సీఎన్జీపై మొత్తం రూ.6 భారం పడింది. వరుస ధరల పెంపులతో సీఎన్జీ వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సహజవాయువు, ముడి చమురు ధరల్లో అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర అస్థిరత కొనసాగుతోంది. ముఖ్యంగా హర్మూజ్ జలసంధిలో సరఫరా అంతరాయాలు, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు, ఇరాన్ యుద్ధ ప్రభావంతో చమురు, గ్యాస్ మార్కెట్లు ఒత్తిడికి గురయ్యాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలోనే చమురు మార్కెటింగ్ సంస్థలు వరుసగా ధరలు పెంచుతున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. సీఎన్జీ ధరల పెంపుతో ప్రధానంగా క్యాబ్ సేవలు, ఆటోరిక్షాలు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ రంగాలపై ప్రభావం పడనుంది. ముఖ్యంగా దిల్లీ వంటి నగరాల్లో భారీ సంఖ్యలో బస్సులు, క్యాబ్‌లు సీఎన్జీపై ఆధారపడుతున్నాయి. దీంతో నిర్వహణ వ్యయాలు గణనీయంగా పెరగనున్నాయి. ఈ అదనపు భారం చివరికి ప్రయాణికులపై పడే అవకాశముంది.

## టీడీపీ సరికొత్త మహానాడుకు సర్వం సిద్ధం: పల్లా



**మంగళగిరి, పతాకం న్యూస్:** తెలుగుదేశం పార్టీ ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'మహానాడు' కార్యక్రమం ఈసారి సరికొత్త రూపంలో జరగనుంది. దేశ రాజకీయాల్లోనే ఒక వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుడుతూ, మే 27, 28 తేదీల్లో 'హైబ్రిడ్ మహానాడు' నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్ కేంద్ర కార్యాలయం వేదికగా జరగనున్న ఈ కార్యక్రమాన్ని, రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 1,848 క్లస్టర్లకు డిజిటల్ సాంకేతికత ద్వారా అనుసంధానించి, లక్షలాది మంది కార్యకర్తలను భాగస్వాములను చేయనున్నారు. 'స్త్రీశక్తి'ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని ఈ మహానాడు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వాస్తవానికి ఈ ఏడాది మహానాడును నెల్లూరులో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించాలని టీడీపీ మొదట ప్రణాళిక రచించింది. అయితే, పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో దేశ పౌరులు ఖర్చులు తగ్గించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును స్ఫూర్తిగా తీసుకున్నట్లు పల్లా శ్రీనివాస రావు వివరించారు. దేశ యోగక్షేమాలను దృష్టిలో ఉంచుకుని, భారీ ఖర్చుతో కూడిన భౌతిక కార్యక్రమాన్ని రద్దు చేసుకుని, హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలని పార్టీ నిర్ణయించిందని ఆయన పేర్కొన్నారు. ఈ మార్పు ద్వారా ఆదా అయిన నిధులను పార్టీ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తామని తెలిపారు. ఈ నిర్ణయం దేశం కోసం టీడీపీ వేస్తున్న డిజిటల్ అడుగులకు నిదర్శనమని ఆయన అభివర్ణించారు. ఈ హైబ్రిడ్ మహానాడు ఆలోచన వెనుక పార్టీ యువ నాయకుడు, హార్వర్డ్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి నారా లోకేష్ దార్శనికత ఉందని పల్లా తెలిపారు. ఆయన అనుభవం, సాంకేతిక పరిజ్ఞానంతో తెలుగుదేశం పార్టీని డిజిటల్ యుగంలోకి నడిపిస్తున్నారని కొనియాడారు. సుమారు రెండు వేల క్లస్టర్ల ద్వారా లక్షలాది మంది కార్యకర్తలను ఏకకాలంలో అనుసంధానించడం ఒక ప్రాంతీయ పార్టీకి రికార్డు అని, ఇది దేశ చరిత్రలోనే ఒక విప్లవాత్మక ఘట్టంగా నిలిచిపోతుందని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ నిర్వహించనున్న ఈ హైబ్రిడ్ మహానాడుపై ఇతర రాజకీయ పార్టీల్లోనూ తీవ్ర ఆసక్తి నెలకొందని ఆయన వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు, నారా లోకేష్ సహా ముఖ్య నేతలు పరిమిత సంఖ్యలో భౌతికంగా పాల్గొంటారు. రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 1,848 క్లస్టర్ల వద్ద భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి, కేంద్ర కార్యాలయంలో జరిగే కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. ప్రతి క్లస్టర్ నుంచి ఎంపిక చేసిన కార్యకర్తలు, నేతలు నేరుగా చంద్రబాబు, లోకేష్‌లతో మాట్లాడే అవకాశం కల్పిస్తారు. దీనివల్ల ప్రతి కార్యకర్త నేరుగా మహానాడులో పాల్గొన్న అనుభూతి పొందుతాడని పార్టీ భావిస్తోంది. గతంలో వేలాది మంది మాత్రమే పాల్గొనే అవకాశం ఉండగా, ఈసారి లక్షలాది మందికి మహానాడు చేరువ కానుంది.

## మోడీపై శివరాజ్ సింగ్ చౌహాన్ పుస్తకం.. ఢిల్లీలో ఆవిష్కరణకు హాజరైన మంత్రి లోకేష్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రచించిన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీతో తనకున్న వ్యక్తిగత అనుబంధం, అనుభవాల గురించి వివరిస్తూ చౌహాన్ 'అప్నాపన్: మై ఎక్స్‌పీరియన్సెస్ విత్ నరేంద్ర మోదీ' పేరుతో ఈ పుస్తకాన్ని రాశారు. ఢిల్లీలోని పూసాలో ఉన్న ఐకార్ క్యాంపస్‌లో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ పుస్తకాన్ని మాజీ ప్రధాని హెచ్.డి. దేవెగౌడ, మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. ఈ వేడుకలో ఏపీ మంత్రి నారా లోకేష్ పాల్గొని పలువురు జాతీయ స్థాయి నేతలను కలిశారు. ఈ కార్యక్రమానికి ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు, బీజేపీ సీనియర్ నేతలు, సాహితీవేత్తలు హాజరయ్యారు. ప్రధాని మోదీ నాయకత్వ లక్షణాలు, ఆయన వ్యక్తిత్వం, ప్రజలతో మమేకమయ్యే తీరును ఈ పుస్తకం చక్కగా వివరిస్తుందని వక్తలు ప్రశంసించారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైన టీడీపీ తరఫున లోకేష్ ఈ కార్యక్రమంలో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.

(మొదటిపేజీ తరువాయి)

## సీఎం చంద్రబాబు సమీక్ష

ఆయన కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన రియల్-టైమ్ గవర్నెన్స్ సిస్టమ్ (ఆర్‌టీజీఎస్) ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో అధికారుల వైఖరి పట్ల ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పనుల్లో అధికారులు చురుకుగా పని చేయాలని నిర్ణయించిన సమయంలోపు పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సేవలు ప్రజలకు మరింత వేగంగా చేరేలా కాలం చెల్లిన ప్రభుత్వ నిబంధనలను సవరించడానికి తక్షణమే ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సీఎం ఆదేశించారు. బాగా పనిచేసే అధికారులను ప్రశంసిస్తామని నిర్లక్ష్యంగా వ్యవహరించే వారు ఓరియెంటేషన్ తరగతులకు హాజరు కావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి శాసనసభ నియోజకవర్గానికి నియమించిన నోడల్ అధికారుల సేవలను పూర్తిగా వినియోగించుకోవాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఏడాదిలోగా రెవెన్యూ సంబంధిత సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రజలకు హామీ ఇచ్చిందని అయితే ఆ సమయం ఇప్పటికే గడిచిపోయిందని ఆయన అధికారులకు గుర్తు చేశారు. ముఖ్యంగా కుటుంబ కలహాల కారణంగా నిలిచిపోయిన భూ వివాదాలను మానవతా దృక్పథంతో కౌన్సెలింగ్ అందించడం ద్వారా పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కుల ధృవీకరణ పత్రాలు పొందడానికి విద్యార్థులు, సాధారణ ప్రజలు ఇకపై ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ ధృవీకరణ పత్రాలను వారు నేరుగా ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలుగా నిబంధనలు రూపొందించాలని ఆయన ఆదేశించారు. సైబర్ నేరాలను అరికట్టడానికి పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆర్‌టీజీఎస్‌తో సమర్థవంతమైన సమన్వయం ఉండేలా ప్రతి ప్రభుత్వ శాఖలో ఒక ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. సైబర్, ఆర్థిక నేరాల నియంత్రణకు యాక్షన్ ప్లాన్ రూపకల్పనపై చర్చించారు. సైబర్ నేరగాళ్లు ఇతరుల బ్యాంకు ఖాతాలను దుర్వినియోగం చేయకుండా నిరోధించే చర్యలు 'గోల్డెన్ అవర్' భావన ఏపీ సైబర్ విధానం, ఇతర సంబంధిత అంశాలపై చర్చలు జరిగాయి. వీటన్నిటినీ కచ్చితంగా అమలు చేసే విధంగా అధికారులు అవసరమైన చర్యలు తీసుకొవాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, పలువురు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రత్యేక చర్యలు: పవన్

అంటూ నిలదీశారు. ఇంత కాలుష్యం విడుదల చేస్తున్న ఆంధ్ర పేపర్ మిల్క్ ఎందుకు నోటీసులు ఇవ్వలేదని కాలుష్య నియంత్రణ మండలి అధికారులపై పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఆ పరిశ్రమ చెల్లించాల్సిన రూ.13 కోట్ల బకాయిలు ఎందుకు వసూలు చేయలేకపోతున్నారని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరిని ప్రశ్నించారు. అధికారులు బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించకపోతే ప్రజలకు మేం సమాధానం చెప్పుకోవాలంటూ అధికారులపై పవన్ కల్యాణ్ అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి నీటినీ నదిలోకి వదిలి అక్కడ మన పిల్లల్ని స్నానం చేయించే సాహసం చేయగలమా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమల కాలుష్యం విషయంలో కాలుష్య నియంత్రణ నిబంధనలు అందరూ పాటించాల్సిందేనని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. పరిశ్రమలు వాటిని పాటించేలా అధికారులు పని చేయాలని, క్షేత్రస్థాయిలో మీకు ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని ముఖ్యమంత్రితో, కేబినెట్‌లో మాట్లాడి పరిష్కరిస్తానని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. గోదావరిలో కాలుష్య నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పవన్‌కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. సాస్కి నిధులతో చేపట్టిన రోడ్ల పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కేంద్రం నుంచి ఏ ప్రాజెక్టులకు నిధులు తీసుకురావచ్చో ప్రతిపాదనలు అడిగారు. రాజమహేంద్రవరం సమీపంలో దోబీఘాట్ కోసం మాడ్యులార్ ట్రీట్‌మెంట్‌ను నిర్మించాలని ఆదేశించారు. కాలుష్య నివారణ చర్యల కోసం రూ.100 కోట్లు పీసీబీకి ఇవ్వాలని పవన్ కోరారు. రూ.100 కోట్లతో గోదావరిలో కాలుష్య నివారణకు ప్రత్యేక చర్యలకు ఆదేశించారు. రాజమహేంద్రవరం సమీపంలోని కాతేరును వీఐపీ ఘాట్‌గా సిద్ధం చేయాలన్నారు. మునికూడలిని మోడల్ పుష్కరఘాట్‌గా సిద్ధం చేయాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖ నిధులతో జూన్ 25లోపు మోడల్ ఘాట్ సిద్ధం చేయాలన్నారు. ప్లాస్టిక్ స్థానంలో బయోడీగ్రేడబుల్ వస్తువులు వినియోగించాలని అధికారులకు పవన్ కల్యాణ్ ఆదేశించారు. "పర్యావరణ పరిరక్షణ, అఖండ గోదావరి ప్రాజెక్టులో కీలకం. కాలుష్య రహితం చేయడం నా బాధ్యత. పది కోట్లమంది రానున్న దృష్ట్యా ఉదాసీనతగా వ్యవహరిస్తే ప్రజలు నన్ను క్షమించరు. ఏలూరులో నీటి కాలుష్యంతో ప్రజలు అస్వస్థతకు గురయ్యారు. పరిశ్రమలు నిబంధనలు ఉల్లంఘిస్తే చెడ్డపేరు వచ్చేది కూటమి ప్రభుత్వానికే. ఆంధ్రా పేపర్ మిల్లు ప్రభుత్వానికి రూ.13 కోట్లు బకాయిలు ఉన్నా చెల్లించలేదు. బకాయిలు చెల్లించి పరిశ్రమలు బాధ్యతగా వ్యవహరించాలి. మురుగునీరు కలిస్తే పుణ్యం కాదు, రోగాలు మాత్రం కచ్చితంగా వస్తాయి. గోదావరి నది కాలుష్యంతో విలవిల్లాడుతోంది. పుష్కరాల నాటికి గోదావరిని కాలుష్య రహితంగా చేయడమే లక్ష్యం" అని పవన్ కల్యాణ్ తెలియజేశారు.

# యలమంచిలిలో మహా సిమెంట్ కార్మికుల నిరసన



**యలమంచిలి, పతాకం న్యూస్:** ఎన్నాళ్లు చేసిన అదే కూలి-అదే స్థాయి, తమ లాభమే కానీ కార్మికుల కష్టం పట్టదా? అంటూ కార్మికులు నిరసన చేపట్టారు. యలమంచిలి మండలంలోని ములకలపల్లి గ్రామంలో ఉన్న మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (మహా సిమెంట్ కర్మాగారం) వద్ద మంగళవారం కార్మికులంతా తమ విధులను ఆపేసి యాజమాన్యం పద్ధతులను నిరసిస్తూ మెయిన్ గేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సంస్థలో వేరు వేరు కాంట్రాక్టర్ల ద్వారా దాదాపు 500 మంది పైగా రోజు వారి కూలితో పని చేస్తున్నారని కార్మికులు తెలిపారు. తామంతా సంస్థలో చేరి ఎన్ని సంత్సరాలయినా అదే స్థితిలో ఉన్నామని, చేరినప్పుడు ఉన్న కూలీనే ఇప్పటికీ ఇస్తున్నారు తప్ప ఏమాత్రం పెంచలేదని చెప్పారు. ఇప్పటివరకు సంస్థలో స్కిల్డ్ రూ.703, సెమీ స్కిల్డ్ రూ.560, అన్ స్కిల్డ్ రూ.470 మాత్రమే ఇస్తూ ఎలాంటి వారంతాపు సెలవులు లేవు, అనారోగ్య సెలవులు లేవు, ఏరోజు వస్తే ఆరోజు మస్తరు పద్దతిలో నడుపుతున్నారని వివరించారు. ఈ కాంట్రాక్టు కార్మికులు ఏ స్థాయిలో చేరారో, మూడు, ఐదు, ఎనిమిది ఎన్ని సంవత్సరాలు గడిచినా అదే స్థాయిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు సంత్సరాలుగా ఎలాంటి కూలి పెంపు లేకుండా ఇటీవల రోజుకి రూ.9 పెంచుతూ, ఇది జూన్ నెల నుంచి అమలవుతుందని యాజమాన్యం ప్రకటించిందని తెలిపారు. ఈ పద్ధతి నచ్చని కార్మికులు తమ విధులు బహిష్కరించి ఉదయం నుంచి మండుటెండలోనే నిరసనలు తెలుపుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారంతపు సెలవుతో కూడిన నెల వారి జీతం చెల్లించాలి. 2 సంవత్సరాలు దాటి పని చేస్తున్న వారిని తరువాత స్థాయికి పంపాలి. యూనియన్ ఏర్పాటుకి అవకాశం కల్పించాలని కార్మికులు కోరారు.

## ఆకట్టుకుంటున్న ఆదివాసీ రేలా ఉత్సవాలు



**రాజవొమ్మంగి, పతాకం న్యూస్:** అక్కడ ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలు వెల్లివిరిశాయి. అటవీ ఉత్పత్తులు కొలువుదీరి, నోరూరించాయి. అడవిలో, ఇంట్లో నిత్యం ఉపయోగించే వేట పరికరాలు, బుట్టలు, తదితరాలు పాత రోజులను స్ఫురింపజేశాయి. వేషధారణలు ముచ్చటగొలిపాయి. ఆదివాసీల నృత్యాలు అబ్బురపరిచాయి. వేలాది మంది చప్పట్ల నడుమ ప్రతి కళా ప్రదర్శన ఉత్తేజభరితంగా సాగింది. వెరసి రంపచోడవరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన జరుగుతున్న రేలా ఉత్సవాలు తెందరినీ ఆకట్టుకున్నాయి. రెండో రోజు ఉత్సవాలకు రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ చోల్ల బొజ్జిరెడ్డి, జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్. ఎస్టీ కమిషన్ సభ్యులు గొర్లె సునీత, ఐటిడిఎ పిఒ ప్రశాంత్ కుమార్. డిఎఫ్ఒ శివకుమార్ గంగాలాల్ తదితరులు అతిథులుగా హాజరై రేలా ఉత్సవాలను వీక్షించారు. నిర్వాహకులను అభినందించారు. తొలుత జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ డోలికట్టు ప్రదర్శన ప్రారంభించారు. గిరిజన సంప్రదాయబద్ధమైన భూమి పూజ చేపట్టారు. ఆదివాసీ జెండాను ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ బొజ్జిరెడ్డి ఆవిష్కరించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్ల అన్నింటా అధికారులు, ప్రముఖులు, మేధావులు, గిరిజన, ప్రజా సంఘాల నేతలు కలియదిరిగి అటవీ ఉత్పత్తుల, వంటకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. చోడి జావ, రాగి జావ, చింతూరు విలీన మండలాల్లో విరివిగా దొరికే విప్ప పువ్వును రుచిచూశారు. రేలా వేదికపై ప్రదర్శించిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. రాజవొమ్మంగి మండలం పూదేడు గ్రామ గిరిజనులు 'మా గూడెం గూడెం దింసారే' నృత్యం యువతను కట్టిపడేసింది. చింతూరు మండలం ఆదివాసీ మహిళా ఉపాధ్యాయులు ప్రదర్శించిన పెర్మాకోరు నృత్యం, ఎటపాక మండలం వారు ప్రదర్శించిన అందెలు కళారూపం అలరించాయి. విఆర్ పురం మండలం అడివి వెంకన్న గూడెం గిరిజనుల బృందం గిరిజనులు సాంప్రదాయ బద్ధంగా జరుపుకునే పెళ్లి తంతును కళ్లకు కట్టినట్టు చూపారు. పెళ్లి తంతులో వధూవరులకు చదివింపుల నేపథ్యంలో ఐటిడిఎ పిఒ ప్రశాంత్ రూ.3 వేలు చదివించారు. రాజవొమ్మంగి మండలం కేశవరం గ్రామస్తులు ప్రదర్శించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. కళాకారులకు అతిథులు మెమోంటోలు అందజేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.లోకనాథం, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోతా రామారావు, కిల్లో సురేంద్ర, నాయకులు బొప్పెన కిరణ్, పులి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## ఎబోలా వైరస్ ఎఫెక్ట్.. విజయవాడ విమానాశ్రయంలో స్క్రీనింగ్ పరీక్షలు




**విజయవాడ, పతాకం న్యూస్:** ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వైరస్ కేసులు, మరణాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వైరస్ రాష్ట్రంలోకి ప్రవేశించకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటుంది. అందులో భాగంగా నేడు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎబోలా వైరస్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కేంద్ర పౌర విమానయానశాఖ ఆదేశాల మేరకు విదేశీ ప్రయాణికులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం సింగపూర్ నుంచి తరలివచ్చిన ప్రయాణికులకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు ఆరోగ్య సిబ్బంది ఎబోలా వైరస్ పరీక్షలు చేపట్టారు. తొలిరోజు మొత్తం 185 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్య అధికారి డాక్టర్ సృజన తెలిపారు. ప్రయాణికుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నామని వెల్లడించారు. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల ఆరోగ్య భద్రత కోసం విమానాశ్రయంలో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. మరోవైపు ఎబోలా వైరస్ రాష్ట్రంలోకి ప్రవేశించకుండా ఉండేందుకు తక్షణమే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఇప్పటికే అధికారులను ఆదేశించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కూడా రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. కాంగో, ఉగాండా, సూడాన్ వంటి ఎబోలా ప్రభావిత ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు విమానాశ్రయాల్లోనే ఖచ్చితంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

## ఎట్టకేలకు అందుబాటులోకి రైతు బజారు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి పట్టణ ప్రజలు, చుట్టుపక్కల మండలాల్లో కూరగాయ పంటలు సాగు చేసే రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతుబజారు ఎట్టకేలకు అందుబాటులోకి రానున్నది. ఎన్టీఆర్ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన రైతుబజారును కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా ప్రారంభించేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. అనకాపల్లికి రైతుబజారు 2022లోనే మంజూరైంది. అయితే అప్పటి పాలకులు దృష్టి సారించకపోవడంతో ఇది ఏర్పాటుకు నోచుకోలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ రైతుబజారు ఏర్పాటుపై శ్రద్ధ చూపారు. కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో ఖాళీగా ఉన్న బ్లాకులను పరిశీలించారు. వీటిల్లో 17, 18 నంబర్ల బ్లాకులు ఖాళీగా ఉండడంతో రైతుబజారు ఏర్పాటుకు అనువుగా మార్కెటింగ్ శాఖ అధికారులు సుమారు వంద దుకాణాలను (స్టాల్స్) నిర్మించారు. రంగులు వేయించి, విద్యుత్ పనులు చేపట్టారు. రైతుబజారులో 72 దుకాణాలను రైతులకు, 25 షాపులను డ్వాక్రా సంఘాలకు, మూడింటిని దివ్యాంగులకు ఇటీవల లాటరీ విధానంలో కేటాయించారు. మంగళవారం కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా రైతుబజారును ప్రారంభించనున్నట్టు మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు అశోక్‌కుమార్ తెలిపారు. ఎట్టకేలకు రైతుబజారు అందుబాటులోకి రానుండడంతో పట్టణ వినియోగదారులు, సమీప గ్రామాల్లో కూరగాయ పంటలను సాగు చేసే రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం



**అరకులోయ, పతాకం న్యూస్:** మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, హక్కులపై అవగాహన ఉండాలని కలెక్టర్ టి.నిషాంతి సూచించారు. అరకులోయలో 'మహిళల భద్రత- మన బాధ్యత' అనే అంశంపై ఎస్పీ అమిత్‌బర్దార్ ఆదేశం మేరకు పోలీసులు మూడు మండలాల మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా సంఘాల సభ్యులకు నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని, గర్భిణులు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుని పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం ఎస్పీ అమిత్‌బర్దార్ మాట్లాడుతూ మన్యం ప్రాంతంలో ఇటుకల పండుగ సందర్భంగా రోడ్లకు అడ్డంగా తాళ్లు కట్టి డబ్బులు అడగడం మంచి పద్ధతికాదని, ఆచారం పేరుతో ఎవరినీ ఇబ్బంది పెట్టొదన్నారు. బాల్య వివాహాలు చేస్తే ఆరోగ్యవంతమైన పిల్లలు పుట్టరని, దీనికి తోడు తల్లీబిడ్డకు ప్రాణాపాయం ఉంటుందని చెప్పారు. జిల్లా ఫిర్యాదుల కమిటీ చైర్‌పర్సన్ కృష్ణకుమారి మాట్లాడుతూ మహిళలు శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఏ సమస్య వచ్చినా ఈ శక్తియాప్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసుల సహాయం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ చలపతి, తదితరులు పాల్గొన్నారు.

## మండుతున్న ఎండలు.. అల్లాడిపోతున్న ప్రజలు



**భీమవరం, పతాకం న్యూస్:** జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయిలో 45 డిగ్రీల వరకు నమోదైంది. వారం రోజులుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న స్థాయిలో ఉక్కపోత లేకపోవడం కొంత ఉపశమనం. తణుకు, తాడేపల్లిగూడెం, గణపవరం ప్రాంతాలల్లో 44 నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 9గంటల నుంచి వడగాడ్పులకు భయపడి ప్రజలు బయటకు రావడం లేదు. పాలకొల్లు పట్టణంలో చాలామంది వ్యాపారులు 11 గంటలకు షాపులు మూసి వేసి ఇళ్లకు వెళ్లిపో యారు. తిరిగి సాయంత్రం 4గంటల తరువాత షాపులు తెరిచారు. శీతల పానీయాలకు గిరాకీ వచ్చింది. తాడేపల్లిగూడెం పట్టణం, పరిసర ప్రాంతాల్లో ప్రధాన రహదారులు ఉదయం 10 గంటలకే నిర్మానుషంగా మారుతున్నాయి. ఎండ తీవ్రతకు భయపడి అత్యవసర పని ఉంటే తప్ప జనం బయటకు రావడం లేదు. ఇళ్లకే పరిమిత మవుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే తాడేపల్లిగూడెం తాలూకా ఆఫీస్ సెంటర్ నిర్మానుష్యంగా మారింది. చిన్నపాటి వీధుల్లో కూడా జనసంచారం లేదు.

## మన్యంలో 10 వేల మందికి కొత్త పెన్షన్లు



**పాడేరు, పతాకం న్యూస్:** జిల్లాలో పది వేల మందికి కొత్తగా ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లు అందనున్నాయి. సహజంగా 60 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ వృద్ధాప్య పెన్షన్ అందిస్తుండగా, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నూతన పెన్షన్లకు శ్రీకారం చుట్టలేదు. అయితే ఎన్నికల హామీలను అమలు చేయడంతోపాటు అర్హులైన వారందరికీ ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ అందించాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం కొత్త పెన్షన్లపై కాస్త గ్యాప్ తీసుకుందని అధికారులు అంటున్నారు. ఈక్రమంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 60 ఏళ్లు నిండిన వృద్ధులతోపాటు 50 ఏళ్లు నిండిన బీసీ, ఎస్‌సీ, ఎస్‌టీలకు వృద్ధాప్య పెన్షన్ అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వ కసరత్తు చేస్తున్నది. ఈ మేరకు ఇప్పటికే జిల్లాల వారీగా లబ్ధిదారుల వివరాలను సేకరించిన ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల మందికి లబ్ధిచేకూరుతుందని ఒక అంచనాకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ పథకం ద్వారా జిల్లాలో కొత్తగా 10 వేల మందికి లబ్ధిచేకూరనుందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని పదకొండు మండలాల్లో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, వైద్య పెన్షన్లు పొందుతున్న వారు 73,700 మంది ఉన్నారు. అయితే తాజా ప్రతిపాదనల ప్రకారం జిల్లాలో 60 ఏళ్లు నిండిన కొత్తవారితోపాటు 50 ఏళ్లు నిండిన బీసీ, ఎస్‌సీ, ఎస్టీ లబ్ధిదారులు మరో 10 వేలు వరకు ఉంటారని అధికారులు అంటున్నారు. వారిలో ఎస్‌టీలు 8,500 మంది, ఎస్‌సీ, బీసీ కలిపి 1,500 మంది లబ్ధిదారులుంటారని అధికారులు భావిస్తున్నారు. ఇతర ప్రాంతాలతో పోల్చితే గిరిజనులు అత్యంత పేదరికంతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో 50 ఏళ్లు నిండిన గిరిజనులకు వృద్ధాప్య పెన్షన్ అందించడం ద్వారా వారికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నేటికీ గిరిజన ప్రాంతంలో అనేక మంది సొంత భూమి, ఉపాధి అవకాశాలు లేని వృద్ధులున్నారు. ఈ క్రమంలో కొత్త పెన్షన్ విధానంతో ఇన్నాళ్లుగా ప్రభుత్వ సాయానికి నోచుకోని అనేక మంది గిరిజనులు వృద్ధాప్య పెన్షన్ పొందనున్నారు. అలాగే అర్హులైన పలువురు పెన్షన్ లబ్ధిదారులు సైతం ఇప్పటికే అధికారులకు దరఖాస్తులు చేసుకున్నారు. ఈక్రమంలో వారికి సైతం పెన్షన్లు మంజూరయ్యే అవకాశాలున్నాయని అధికారులు అంటున్నారు.

## ఎంఎస్‌ఎంఈలకు ప్రాధాన్యం




**బుచ్చెయ్యపేట, పతాకం న్యూస్:** సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని, ఇందులో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్‌ఎంఈ పార్కును ఏర్పాటు చేస్తున్నదని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. మండలంలోని ఆర్.భీమవరంలో ఏర్పాటు చేయనున్న ఎంఎస్‌ఎంఈ పార్కుకు ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లా పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదని, జిల్లాలో 172 చిన్న పరిశ్రమలకు భూములు కేటాయించామని, ఇవి వచ్చే ఏడాది డిసెంబర్‌నాటికి పూర్తయి ఉత్పత్తులను ప్రారంభిస్తాయని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కనీసం డిగ్రీ వరకు చదివించాలని, ఒకవేళ ఉద్యోగం రాకపోతే ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లలో వృత్తి నైపుణ్యంలో శిక్షణ ఇప్పించి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని అన్నారు. చోడవరం ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ, నియోజకవర్గాన్ని అగ్రికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే 80 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. గోవాడ షుగర్ ప్యాక్టరీలో డిస్టిలరీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు సారథ్యంలో అనకాపల్లి జిల్లాలో నెలకొక కొత్త ఫ్యాక్టరీకి శంకుస్థాపన జరుగుతున్నదని అన్నారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ, ఇటు వ్యవసాయం, ఇటు పరిశ్రమలను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, ఏపీఐఐసీ డీజడ్ఎం సూర్యనారాయణ, తహశీల్దారు ఎం.లక్ష్మి, ఎంపీడీవో శివప్రసాద్, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపీపీ నాగేశ్వరి దేవి, పలువురు కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

## వడగాడ్పులతో జనం విలవిల

**అనకాపల్లి, పతాకం న్యూస్:** జిల్లాలో ఎండ తీవ్రత, వడగాడ్పుల ప్రభావం మంగళవారం కూడా కొనసాగింది. దాదాపు సగం మండలాల్లో 40 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ తారెత్తించడంతో జనం ఇళ్ల నుంచి బయటకు రాలేదు. వేడి గాలులు, ఉక్కపోత కారణంగా ఉక్కిరిబిక్కిరి అయ్యారు. వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు ఆపసోపాలు పడుతున్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు తెల్లవారుజామున ఐదు గంటలకే పొలం పనులకు వెళ్లి, పది గంటలకల్లా తిరుగుముఖం పడుతున్నారు. కాగా మాకవరపాలెం మండలంలో అత్యధికంగా 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దేవరాపల్లిలో 42.8 డిగ్రీలు, నర్సీపట్నంలో 42.6, రావికమతంలో 40.8, రోలుగుంటలో 40.8, గొలుగొండలో 40.5, నాతవరంలో 40.5, పరవాడలో 40, సబ్బవరంలో 40, బుచ్చెయ్యపేటలో 39.9, చోడవరంలో 39.7, కశింకోటలో 39.6, మాడుగులలో 39.6, కోటవురట్లలో 39.4, చీడికాడలో 39.4, కె.కోటపాడులో 39.1, అనకాపల్లిలో 38.9, మునగపాకలో 38.8, ఎస్.రాయవరంలో 37.8, పాయకరావుపేటలో 37.2, ఎలమంచిలిలో 37.1, నక్కపల్లిలో 36.5, రాంబిల్లిలో 36.4, అచ్యుతాపురంలో 36.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రావికమతం మండలంలోని దొండపూడి గ్రామంలో వడదెబ్బకు ఒక వృద్ధురాలు మృతి చెందింది. మండలంలోని దొండపూడి గ్రామానికి చెందిన గర్రెడ్డి దేముడమ్మ(60) పొలం పనికి వెళ్లి మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటికి వచ్చి సొమ్మసిల్లి పడిపోయింది. కుటుంబ సభ్యులు సపర్యలు చేసి ఆస్పత్రికి తరలించేలోపే ఆమె మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

## తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** పిల్లల పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా న్యాయాధికారి ఎం.బబిత సూచించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలతో జిల్లా కోర్టు ప్రాంగణంలో ఇంటర్నేషనల్ మిస్సింగ్ చిల్డ్రన్ డే కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన బబిత మాట్లాడుతూ పిల్లలను సెల్‌ఫోన్ వినియోగానికి దూరంగా ఉంచాలన్నారు. పిల్లల పట్ల నిర్లక్ష్యంగా వుండడం వల్ల రోజుకు సగటున తొమ్మిది మంది పిల్లలు తప్పిపోతుండడం ఆందోళన కలిగించే విషయమన్నారు. పిల్లలు తప్పిపోయిన 24 గంటల్లో కేసు నమోదు చేయాలన్నారు. పీఎల్‌ఏపీయుస్ చైర్మన్ దుర్గయ్య మాట్లాడుతూ, ఎన్‌సీబీ రికార్డుల ప్రకారం ప్రతి రోజూ పుట్టిన శిశువుల్లో ఏడు శాతం తప్పిపోవడం బాధాకరమన్నారు. పిల్లల దత్తత, హక్కులు, విద్యా అవకాశాలపై అవగాహన పెంపొందించుకోవాలని, విద్యా హక్కు చట్టాన్ని వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో విజయనగరం ఇన్‌చార్జి డీఎస్పీ రాఘవులు, ఏపీపీ గేదెల సత్యం, ఎంఈఓ ఆనందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎస్ఎంఈ పార్కులకు శ్రీకారం



**అనకాపల్లి, పతాకం న్యూస్:** నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆ మాట నిలబెట్టుకుంటోంది. ఎన్నికల హామీల్లో భాగంగా మరో హామీ కార్యరూపం దాల్చే దిశగా కీలక అడుగు పడింది. జిల్లాలో రెండు చోట్ల ఎంఎస్ఎంఈ పార్కులకు సీఎం చంద్రబాబునాయుడు అమరావతి నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. విజయనగరం నియోజకవర్గానికి సంబంధించి కొండకరకాం పంచాయతీలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేసున్నారు. శంకుస్థాపన కార్యక్రమంలో జిల్లా నుంచి ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కలెక్టర్ రామసుందర్‌రెడ్డి పాల్గొన్నారు. కొండకరకాంలో భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. సీఎం చంద్రబాబు శంకుస్థాపనను వీక్షించారు. ఆయన ప్రసంగాన్ని విన్నారు. రేగిడి మండలం గుల్లపాడులో రూ.4.20కోట్లతో ఏర్పాటుచేయనున్న ఎంఎస్ఎంఈ పార్కు శంకుస్థాపన కోసం రేగిడి ఎంపీడీవో కార్యాలయంలో శిలాఫలకం, స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, చీపురపల్లి ఆర్డీవో సుధారాణి పాల్గొన్నారు. దశలవారీగా గుల్లపాడు ఎంఎస్ఎంఈ పార్కుకు రూ.15కోట్లు నిధులు వచ్చేలా, ఈప్రాంతం పారిశ్రామిక అభివృద్ధి జరిగేలే సీఎం చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ జయచంద్ర, తహసీల్దార్ ఈశ్వరరావు, వింపీడీవో శ్యామలాకుమారి తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామిక వేత్త రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి అన్నారు. కొండకరకాం గ్రామంలో ఎంఎస్ఎంఈ పార్కునకు శంకుస్థాపన జరిగాక ఆయన మాట్లాడారు. పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ, ఎంఎస్ఎంసీ పార్కులకు సంబంధించి చంద్రబాబు నిర్ణయం గొప్ప ఆర్థిక ప్రగతికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజరు కృష్ణప్రసాద్, ఆర్‌డీఓ సుధాసాగర్, ఎంపీడీఓ గంటా వెంకటరావు, తహసీల్దారు కూర్మనాథరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీతో కేరళ నూతన సీఎం సతీశన్ తొలి భేటీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** కేరళ నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వి.డి. సతీశన్ నేడు ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో తొలిసారి సమావేశమయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి ఘన విజయం సాధించిన తర్వాత కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు నెలకొల్పుకునే దిశగా ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ప్రధాని కార్యాలయంలో సుమారు 20 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరుతూ సీఎం సతీశన్.. ప్రధానికి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సమావేశంలో కేరళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ. జయతిలక్ కూడా పాల్గొన్నారు. దశాబ్ద కాలం పాటు అధికారంలో ఉన్న పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్‌ను ఓడించి యూడీఎఫ్ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ఈ భేటీ జరగడం రాజకీయంగా ఆసక్తి రేపింది. మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక సహాయం, పెండింగ్‌లో ఉన్న రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వంటి అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. అయితే, భేటీ అనంతరం బయటకు వచ్చిన సతీశన్.. చర్చల వివరాలను వెల్లడించలేదు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీ వచ్చిన ఆయన, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, హోంమంత్రి అమిత్ షా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లతో కూడా సమావేశం కానున్నారు.

# సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగి ఆరుగురి దుర్మరణం



**ఒడిశా, పతాకం న్యూస్:** ఒడిశాలో మంగళవారం ఉదయం విషాద ఘటన చోటుచేసుకుంది. కలహండి జిల్లా మదన్‌పూర్-రాంపూర్ బ్లాక్ పరిధిలోని గౌడ కర్లాంకుంట గ్రామంలో నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగి ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. లోపల ఉన్న విషవాయువులను పీల్చడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగా కడుతున్న సెప్టిక్ ట్యాంక్ లోపల ఉన్న సెంట్రింగ్ సామగ్రిని బయటకు తీయడానికి మొదట ఒక మేస్త్రీ లోపలికి దిగాడు. అయితే ట్యాంక్ లోపల ఆక్సిజన్ లేకపోవడం, విషవాయువులు దట్టంగా ముసురుకోవడంతో అతడు స్పృహతప్పి పడిపోయాడు. లోపల ఉన్న వ్యక్తిని కాపాడేందుకు ఒకరి వెనుక ఒకరుగా మరో ఐదుగురు ట్యాంకులోకి దిగారు. దురదృష్టవశాత్తూ వారు కూడా ఆ విషవాయువుల ప్రభావానికి లోనై అక్కడికక్కడే కుప్పకూలారు.

ట్యాంకులో నుంచి ఎలాంటి చప్పుడు రాకపోవడంతో ఆందోళన చెందిన గ్రామస్థులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. లోపల ఉన్నవారిని వెలికితీసి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే వారు అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుల్లో ముగ్గురు మేస్త్రీలు, ఒక కూలీతో పాటు ఆ ఇంటి యజమాని నిమై పాల్, అతని కుమారుడు ఆకాశ్ పాల్ కూడా ఉన్నారు. ఈ ప్రమాదంలో తీవ్ర అస్వస్థతకు గురైన మరో కార్మికుడు ప్రస్తుతం జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు.

ఈ దారుణ ఘటనపై ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మరణించిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని ప్రకటిస్తూ తక్షణమే నిధులు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రమాదంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## ఖరీఫ్‌కు రైతుల సన్నద్ధం..



**అనకాపల్లి, పతాకం న్యూస్:** ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు వివిధ పంటల సాగు లక్ష్యలను నిర్ణయించి, ఏ పంట ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తారో ప్రణాళికను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. మండలాలకు విత్తనాల కేటాయింపులు జరుపుతున్న అధికారులు తొలకరి వర్షాలు ప్రారంభం అయిన వెంటనే రైతులకు సరఫరా చేయడానికి ఆయా పంటలకు సంబంధించి 22,097 క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో వుంచుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వివిధ రకాల పంటలు 65,700 వేల హెక్టార్లలో సాగు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో దాదాపు 60 వేల హెక్టారుల్లో వరి పంట వుంటుంది. చెరకు 3,569 హెక్టార్లు, మొక్కజొన్న 622 హెక్టార్లు, జొన్న 73 హెక్టార్లు, రాగి 10 హెక్టార్లు, చిరుధాన్యాలు 41 హెక్టార్లు, కంది 65 హెక్టార్లు, పెసర 208 హెక్టార్లు, మినుము 189 హెక్టార్లు, ఉలవ 106 హెక్టార్లు, వేరుశనగ 57 హెక్టార్లు, నవ్వు 672 హెక్టార్లు, పత్తి 88 హెక్టార్లలో సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 50 వేల హెక్టార్లలో వరి సాగు చేశారు. ఈ ఏడాది 20 శాతం పెంచి... 60 వేల హెక్టారుల్లో సాగు చేయించాలని అధికారులు భావిస్తున్నారు. కాగా ఖరీఫ్ పంటల సాగు కోసం రైతులు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం వేసవి దుక్కుల పనులు జోరుగా సాగుతున్నాయి. తొలకరి వర్షాలు కురిసిన వెంటనే పచ్చిరొట్ట విత్తనాలు చల్లడానికి పలువురు రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.


## పల్లెల అభివృద్ధికి సహకరించాలి



**పార్వతీపురం, పతాకం న్యూస్:** పల్లెల అభివృద్ధికి సహకరించాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి కోరారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. గ్రామ పంచాయతీల పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, పర్యావరణ పరిరక్షణ, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామ స్థాయిలో నిర్వహించాల్సిన పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం పనికిరాదన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ రామచంద్రరావు, డీపీవో రవీంద్ర , పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. జిల్లావాసులకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించాలని, పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సబ్ కలెక్టర్లు, తహసీల్దార్లతో సమీక్షించారు. ప్రజలకు వేగంగా సేవలందించాలన్నారు. అధికారులు పారదర్శకంగా వ్యహరించాలని సూచించారు. అర్జీలను నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలన్నారు. భూమి రికార్డుల్లో మార్పులు కచ్చితంగా ఉం డాలని ఆదేశించారు. అర్హులకు ఇంటి స్థలాల కేటాయింపు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు.

## 'వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలి'

**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** గ్రామస్థాయిలో ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానంగా ఉంటూ సేవలందిస్తున్న వీఆర్‌ఏలకు పేస్కేల్ వేతనం అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో



కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు జి.వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థలో తక్కువ వేతనంతో పనిచేస్తూ ప్రజలకు వీఆర్‌ఏలు సేవలందిస్తున్నారని తెలిపారు. పేస్కేల్ అమలు చేయా లని, అర్హత ఉన్న వీఆర్‌ఏలకు వీఆర్వోలుగా ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్‌చేశారు.

## లైన్‌మెన్ పోస్టులు భర్తీ చేయాలి




**పార్వతీపురం, పతాకం న్యూస్:** విద్యుత్ సంస్థలో ఖాళీగా ఉన్న జూని యర్ అసిస్టెంట్, లైన్‌మెన్ పోస్టులు ప్రస్తుతం కాంట్రాక్టు విధానంతో భర్తీ చేయాలని ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (1104) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్‌ఆర్‌కే గణపతి కోరారు. పట్టణంలో ఆ సంఘ పార్వతీపురం మన్యం జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి వేతన సవరణ సంప్రదింపులు కమిటీని పాతవిధానంలోనే ఏర్పాటు చేయా లని కోరారు. కార్యక్రమంలో డిస్కం రాష్ట్ర అధ్యక్షులు వీవీఎస్ నాగేశ్వర రావు, విజయనగరం రీజినల్ కార్యదర్శి ఎస్.లక్ష్మణ పాల్గొన్నారు. కాగా అనం తరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణపతిరావు, సంఘ సభ్యుల ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యం జిల్లా సర్కిల్, డివి జన్ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించారు. మన్యం జిల్లా సర్కిల్ అధ్యక్షుడిగా బి.జీవరత్నం, కార్యదర్శిగా వి.లక్ష్మణలుగా, డివిజన్ అధ్యక్షులుగా ఎన్.వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఆర్.శ్రీధర్‌లను సభ్యులను ఎన్నుకున్నారు.

## 15 కీలక దేవాలయాల్లో వాలెంటీర్ల నియామకం - ఒక్కో ఆలయంలో 5,000 మందికి అవకాశం



**అమరావతి, పతాకం న్యూస్:** తిరుమలలోని శ్రీవారి సేవకుల (స్వచ్ఛంద సేవకులు) నమూనాను అనుసరించి దేవాదాయ శాఖ ఇప్పుడు ఇతర ప్రముఖ ఆలయాల్లోనూ స్వచ్ఛంద సేవకులుగా సేవలు అందించే అవకాశాలను కల్పిస్తోంది. విజయవాడలోని దుర్గా ఆలయం, శ్రీశైలంలోని మల్లన్న, సింహాద్రిలోని అప్పన్న, అన్నవరంలోని సత్యనారాయణ స్వామి ఆలయం వంటి అనేక ప్రముఖ దేవస్థానాల్లో స్వచ్ఛంద సేవకుల కోసం చూస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 7 ప్రధాన, 15 కీలక ఆలయాల్లో పర్వదినాలు, ఉత్సవాలు, ప్రత్యేక వేడుకల సందర్భాల్లో స్వచ్ఛంద సేవకుల సేవలను వినియోగించుకుంటోంది. క్యూ లైన్లలో భక్తుల రద్దీని నియంత్రించడం, తాగునీరు, మజ్జిగ పంపిణీ, మధ్యాహ్న భోజన వేళల్లో అన్నప్రసాదం (పవిత్ర ఆహారం) వడ్డించడం, పూలమాలలు సిద్ధం చేయడం, ఆలయ ప్రాంగణాన్ని అలంకరించడం, హుండీ (విరాళాల పెట్టె) లెక్కింపులో సహాయపడటం వంటి వివిధ విధులను స్వచ్ఛంద సేవకులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఆసక్తి గల వ్యక్తులు దరఖాస్తు చేసుకోవడానికి సంబంధిత ఆలయ వెబ్‌సైట్‌ను సందర్శించి 'వాలెంటీర్' అనే ఆప్షన్‌పై క్లిక్ చేసి, తమ ప్రాథమిక వివరాలను, ఒక ఛాయాచిత్రాన్ని అప్‌లోడ్ చేయాలి. ఈ దరఖాస్తులను పరిశీలించిన అనంతరం ఆలయ అధికారులు ఆమోదం తెలిపి ఒక గుర్తింపు కార్డును జారీ చేస్తారు. ప్రత్యామ్నాయంగా వ్యక్తులు నేరుగా ఆలయాన్ని స్వయంగా సందర్శించి కూడా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. ఇప్పటివరకు శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయం అత్యధిక సంఖ్యలో నమోదయ్యాయి. ఇక్కడ 14,920 మంది స్వచ్ఛంద సేవకులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. 7 ప్రధాన ఆలయాలలో కలిపి మొత్తం 59,704 మంది వ్యక్తులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఆయా ఆలయాల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి.

## తగలబడ్డ ఎయిర్ ఇండియా బస్సు

**హైదరాబాద్, పతాకం న్యూస్:** హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ఒక ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పెద్ద అంబర్‌పేట సమీపంలో ఓఆర్‌ఆర్‌పై ప్రయాణిస్తున్న ఎయిర్ ఇండియా సంస్థకు చెందిన ఒక బస్సులో అకస్మాత్తుగా భారీగా మంటలు చెలరేగాయి. బస్సు వేగంగా వెళుతున్న సమయంలో ఒక్కసారిగా వాహనం వెనుక భాగం నుంచి దట్టమైన పొగలు రావడాన్ని లోపల ఉన్న ప్రయాణికులు గమనించారు. ప్రయాణికులు వెంటనే డ్రైవర్‌ను అప్రమత్తం చేయడంతో, ఆయన క్షణాల వ్యవధిలో చాకచక్యంగా వ్యవహరించి బస్సును రోడ్డు పక్కన నిలిపివేశాడు. ప్రయాణికులు కిందకు దిగుతుండగానే మంటలు బస్సు మొత్తానికి వేగంగా వ్యాపించాయి. ఓఆర్‌ఆర్‌పై బస్సు విపరీతమైన మంటలతో, భారీగా ఎగసిపడుతున్న పొగలతో తగలబడుతుండటంతో ఆ మార్గంలో వెళుతున్న ఇతర వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

## కెజిబివిల్లో 299 పోస్టుల భర్తీ



**అమరావతి, పతాకం న్యూస్:** కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కెజిబివి)ల్లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు సమగ్రశిక్ష నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 352 కెజిబివిల్లో ఖాళీగా ఉన్న 299 బోధనా సిబ్బంది పోస్టులను భర్తీ చేయను న్నట్లు సమగ్రశిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. తూర్పుగోదావరి, బిఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలు మినహాయించి మిగతా జిల్లాల్లో ఈ ఖాళీలు భర్తీ చేయనున్నామని తెలిపారు. ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన 2026-27 విద్యాసంవత్సరానికి చేపడుతున్నట్లు తెలిపారు. 16 ప్రిన్సిపల్ పోస్టులు, 98 పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (పిజిటి), 133 కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ (సిఆర్‌టి), 52 ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ (పిఇటి) పోస్టులు ఉన్నాయన్నారు. జీతం, వయో పరిమితి, విద్యార్హతలు తదితర వివరాలకు http://kgbvrecruitment. apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

## భగ్గుమన్న పొగాకు రైతులు



**ఒంగోలు, పతాకం న్యూస్:** పతనమవుతున్న పొగాకు ధరలపైనా, దగా చేస్తోన్న వ్యాపారులపైనా రైతులు భగ్గుమన్నారు. వేలం ఆపేసి ప్రకాశం, మార్కాపురం జిల్లాల పరిధిలోని పలు వేలం కేంద్రాల వద్ద నిరసనకు దిగారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో పొగాకు రైతులకు మద్దతుగా అన్ని రైతు సంఘాల, ప్రజాసంఘాలు నేతలు పాల్గొన్నారు. శాంతియుతంగా ర్యాలీ చేస్తున్న రైతులను పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో పోలీసులు అడ్డుకొనే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. రైతులు గట్టిగా ప్రతిఘటించడంతో పోలీసులు వెనక్కు తగ్గారు. ఒంగోలు, వెల్లంపల్లి, టంగుటూరు, పొదిలి, కందుకూరు, కొండపి కేంద్రాల వద్ద పొగాకు రైతులు ఆందోళనకు దిగారు. ధర తక్కువగా నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తూ కొండపి కేంద్రం వద్ద రోడ్డుపై రైతులు పొగాకు బేళ్లను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఎపి రైతు సంఘం ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె మాబు మాట్లాడుతూ ఎగుమతి ఆర్డర్లు రాలేదనే సాకుతో వ్యాపారులు పొగాకుకు తక్కువ ధర నిర్ణయించి రైతులను దోచుకుంటున్నా రని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయా కేంద్రాల వద్ద నిరసనల్లో రైతు సంఘాల నేతలు ప్రసంగించారు. పోరాడి గిట్టుబాటు ధర సాధించుకుందామని పిలుపునిచ్చారు.

## ఎక్సైజ్ విధానాలపై మంత్రివర్గ ఉపసంఘం సమీక్ష



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖకు సంబంధించిన కీలక విధానాలు, ఆదాయ వృద్ధి చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై మిశ్రిత విధానంలో మంత్రివర్గ ఉపసంఘం సమావేశం నిర్వహించారు.సమావేశంలో ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర , సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా, కమిషనర్ చామకూరి శ్రీధర్, ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దూర మాధ్యమం ద్వారా సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలో అమలులో ఉన్న ఎక్సైజ్ విక్రయ విధానం, దాని అమలు తీరుపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. లైసెన్స్ రుసుముల సవరణ, మద్యం దుకాణాల పునర్విభజన, వ్యాపారుల ఆర్థిక స్థిరత్వం, పారదర్శకత పెంపు వంటి అంశాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లాల వారీగా విక్రయాలు, ఆదాయం, మార్కెట్ పరిస్థితులపై కూడా సమీక్ష నిర్వహించారు. అంతర్జాతీయ పరిస్థితులు, యుద్ధ ప్రభావం కారణంగా ముడి సరుకులు, రవాణా, ప్యాకేజింగ్ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో బీరు, మద్యం ధరల సవరణ అంశాన్ని కూడా సమావేశంలో పరిశీలించారు. ధరల మార్పులతో ప్రభుత్వ ఆదాయం, వ్యాపారులు, వినియోగదారులపై పడే ప్రభావంపై అధికారులు వివరించారు.

రాష్ట్రంలో బీరు సరఫరా సామర్థ్యాన్ని పెంచేందుకు తయారీ సంస్థలకు ప్రోత్సాహకాలు ఇవ్వడం, ఎగుమతులకు అనుమతులు కల్పించడం, అధిక డిమాండ్ ఉన్న కాలాల్లో తాత్కాలిక చర్యలు చేపట్టడం వంటి అంశాలపై కూడా చర్చ జరిగింది. కొత్త పెట్టుబడులను ఆకర్షించే చర్యలపై అధికారులు వివరణ ఇచ్చారు. అదేవిధంగా విమానాశ్రయాల్లో మద్యం విక్రయ కేంద్రాల ఏర్పాటు, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ బలోపేతం, చలనం ఆధారిత గరిష్ఠ చిల్లర ధర ముద్రణ, అధిక శుద్ధి ఆల్కహాల్ తయారీకి ప్రత్యేక అనుమతి విధానం వంటి అంశాలను కూడా సమావేశంలో సమీక్షించారు. రాష్ట్రంలో పారదర్శకత పెంపు, ఆదాయ వృద్ధి, ఆధునికీకరణ, పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా ఈ సంస్కరణలు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు.

# టూరిజానికి కొత్త కళ.. ప్రభుత్వ స్థలాల్లో టూరిజం భవనాలు



**నరసాపురం, పతాకం న్యూస్:** మొగల్తూరు మండలం పేరు పాలెం బీచ్‌తో పాటు గోదావరి పరివాహక ప్రాంతాలపై పర్యాటక శాఖ దృష్టి సారించింది. ప్రైవేట్ భాగస్వామ్యంతో ఇప్పటికే మొగల్తూరులో ఒక రిసార్ట్స్ నిర్మాణం పూర్తి చేసుకుంది. మరో రెండు రిసార్ట్స్ పనులు చివరి దశలో ఉన్నాయి. నరసాపురంలో బాపు ఘాట్ వద్ద మూత పడిన టూరిజం రెస్టారెంట్ తెరుచుకుంది. తాజాగా యలమంచిలి మండలం చించినాడ వద్ద గోదావరి అందాలను వీక్షించేందుకు వీలుగా బోట్స్ క్లబ్ నిర్మిస్తున్నారు. ఆచంట మండలంలో మాచేనమ్మ కట్ట రోడ్ అభివృద్ధికి ప్రతిపాదనలు పంపారు. ఉండి, తణుకు, తాడేపల్లి గూడెంలో ఖాళీగా ఉన్న ఆర్అండ్‌బీ స్థలాలను గుర్తించారు. వాటిలో టూరిజం భవనాలను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. ఇవి కాకుండా గోదావరి పుష్క రాలకు వచ్చే యాత్రీకుల్ని ఆకర్షించేందుకు వీలుగా టూరిజం శాఖ రూ.19 కోట్లతో పలు పనులకు ప్రతిపాదనలు పంపింది.

టూరిజంపై కలెక్టర్ నాగరాణి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. ప్రధానంగా పేరుపాలెం బీచ్‌ను అభివృద్ధి చేసేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అనుమ తులకు నోచుకోకుండా పెండింగ్‌లో ఉన్న మూడు రిసార్ట్స్‌కు అనుమతి ఇచ్చారు. ఇప్పటికే సీబే రిసార్ట్స్ పనులు పూర్తయ్యాయి. మరో రెండు రిసార్ట్స్ పనులు చివరి దశలో ఉన్నాయి. వీటి వల్ల వచ్చే పర్యాటకులకు వసతి సౌకర్యం ఏర్పడింది. సీబే రిసార్ట్స్ కేపీ పాలెంకు కొత్త అందాలు తీసుకొచ్చింది. బీచ్ వాలీబాల్, బాక్స్ క్రికెట్, రోప్‌వే ఇసుకలో సముద్ర తీరం వెంబడి దూసుకెళ్లే కారు వంటివి ఏర్పాటు చేయడంతో పర్యాటకులు జోష్ అవుతున్నారు. ఈ ప్రాంతానికి రానున్న రోజుల్లో పర్యాటకులు మరింత పెరిగే అవకాశం ఉందని గుర్తించిన కలెక్టర్ నాగరాణి రిసార్ట్స్ నిర్మాణం కోసం 116 ఎకరాలను గుర్తించారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో ఇక్కడ రిసార్ట్స్ నిర్మించాలని నిర్ణయించారు. వీటితో పాటు ఈ బీచ్‌కు దేశ వ్యాప్తంగా గుర్తింపు వచ్చేందుకు బ్లూఫ్లాగ్ కోసం దరఖాస్తు చేశారు. ఇప్పటికే చాలామంది ప్రైవేట్ ఆపరేటర్లు రిసార్ట్స్ నిర్మాణానికి ముందుకొస్తున్నారు. రాష్ట్ర విభజన తరువాత ప్రభుత్వం గోదావరి ప్రాంతాల్లో పర్యాటకుల్ని ఆకర్షించేందుకు నరసాపురంలోని బాపు ఘాట్ వద్ద రెస్టారెంట్‌తో పాటు బోట్ క్లబ్ ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇది మూతపడింది. తాజాగా రెస్టారెంట్‌ను అందు బాటులోకి తీసుకొచ్చారు. త్వరలో గోదావరిలో విహరించేందుకు వీలుగా బోట్‌లను కూడా ఏర్పాటు చేయాలని టూరిజం నిర్ణయిం చింది. ఇది కాకుండా యలమంచిలి మండలం చించినాడ వద్ద ప్రత్యేకంగా బోట్‌క్లబ్ ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించిన పనుల్ని ప్రారంభించారు. ఆచంట మండలంలో మాచేనమ్మ కట్ట అభివృద్ధిపై దృష్టి పెట్టారు. అక్కడికి వెళ్లే యాత్రికులకు వీలుగా రోడ్ అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.మొగల్తూరు మండలం ముత్యాలమ్మ ఆలయం ఆధ్యాత్మికంగా పేరుగాంచింది. ఇక్కడికి వచ్చే భక్తుల కోసం అతిథి గృహం నిర్మిం చాలని ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. దీంతో పాటు ఉండి, తాడేపల్లిగూడెం, తణుకులో ఖాళీగా ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలాలను గుర్తించారు. అక్కడ కూడా టూరిజం భవనాలు నిర్మించేందుకు కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మావుళ్లమ్మ, ముత్యాలమ్మ, పంచారామ క్షేత్రాలకు గతేడాది నుంచి ఆది, సోమవారాల్లో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. ప్రైవేట్ ఆపరేటర్లతో ఒప్పందం కుదుర్చు కోవడంతో ఇతర జిల్లాల నుంచి వచ్చే యాత్రికులు సంఖ్య గణనీయంగా పెరిగింది.

# భవిష్యత్తులో అమరావతి ద్వారా ఏటా రూ 12 వేల కోట్ల ఆదాయం : మంత్రి నారాయణ



**అమరావతి, పతాకం న్యూస్:** భవిష్యత్తులో అమరావతి ద్వారా ఏటా రూ 12 వేల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నట్లు పురపాలక శాఖ మంత్రి పి నారాయణ చెప్పారు. మిగులు 5 వేల ఎకరాలతో రుణాలు చెల్లిస్తామన్నారు. రాజధాని అమరావతిలోని రాయపూడితో నిర్మిస్తున్న అఖిల భారత సర్వీస్ అధికారులు,ఐకానిక్ టవర్ల నిర్మాణాలను మంత్రి పరిశీలించారు. అమరావతి నిర్మాణంపై వైసిపి వ్యాఖ్యలపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సెక్రటేరియట్, పార్లమెంట్ నిర్మాణ లెక్కలను తప్పుగా చెబుతూ ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. జనం నవ్వుకుంటున్నా..మావిగన్ అంటూ పట్టుకుని వేలాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాత్రి వేళలో శరవేగంగా జరుగుతున్న అమరావతి నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. అసెంబ్లీ, హైకోర్టు, ఐకానిక్ టవర్స్, అధికారుల భవనాల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని మంత్రి చెప్పారు. ఐఏఎస్ అధికారుల కోసం నిర్మిస్తున్న 6 టవర్స్‌లో చాలా వరకు పనులు పూర్తయ్యాయని,జూన్ నుంచి దశలవారీగా భవనాలను జీఏడీకి అప్పజెపుతామని చెప్పారు.మొత్తం 30,760 మంది రైతులు 35,059 ఎకరాలు భూములను రాజధాని నిర్మాణానికి ఇచ్చారని, అందులో 30,079 మంది రైతులకు ఇప్పటికే ప్లాట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఇంకా కేవలం 681 మంది రైతులకు చెందిన 524 ఎకరాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మొత్తం 63,342 కమర్షియల్, రెసిడెన్షియల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ పూర్తయిందని,7,482 రిజిస్ట్రేషన్లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియదని అన్నారు.అమరావతి నిర్మాణ పురోగతి దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందన్నారు. వైసిపి నాయకులు మాట తీరు మార్చుకోకపోతే 11 సీట్లు కాస్తా సున్నా అవుతాయని అన్నారు. హైదరాబాద్ సెక్రటేరియట్, పార్లమెంట్ నిర్మాణ వ్యయాలపై పూర్తి డేటాతో మాట్లాడాలన్నారు. హైదరాబాద్‌లో సచివాలయం చదరపు అడుగుకు 13,768 ఖర్చు అయ్యిందని,పార్లమెంట్ నిర్మాణానికి చదరపు అడుగుకు 16,916 ఖర్చు అయిందని అన్నారు.అమరావతి ఐకానిక్ టవర్స్‌కు చదరపు అడుగుకు రూ15,000 నుంచి రూ 16,000 ఖర్చు అవుతోందన్నారు.

# దేశవాళి వరి ప్రయోగాత్మక సాగు సక్సెస్



**చింతపల్లి, పతాకం న్యూస్:** తూర్పుకనుముల్లో పూర్వం ఆదివాసీలు సాగు చేసిన సంప్రదాయ(దేశవాళి) వరి రకాలపై స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు చేపట్టిన ప్రయోగాత్మక సాగు విజయవంతమైంది. మూడేళ్లగా 21 రకాల వంగడాలపై శాస్త్రవేత్తలు వివిధ దశల్లో అధ్యయనం చేశారు. దిగుబడి, నాణ్యత ఆధారంగా ఐదు రకాలు గిరిజన ప్రాంతానికి అనుకూలంగా వున్నాయని శాస్త్రవేత్తలు ప్రయోగాత్మ సాగు ద్వారా నిర్ధారించారు. గిరిజన ప్రాంతంలో కొన్నేళ్ల క్రితం ఆదివాసీలు పలు రకాల సంప్రదాయ వరి విత్తనాలను సాగు చేసేవారు. దేశవాళి వరి రకాలకు ఒక్కొక్క ప్రాంతంలో ఒక రకం పేరుతో ఆదివాసీలు పిలిచేవారు. కొన్ని రకాల వరి విత్తనాలు బాస్మతిని తలపించే సువాసనలు వెదజల్లుతుంటాయి. మరికొన్ని రకాలు మధుమేహం వ్యాధి కలిగిన బాధితులు ఆహారంగా తీసుకున్నా చక్కెర స్థాయిని స్థిరంగా ఉంచుతుంది. ఈ రకాలు ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో లేవు. అతి తక్కువ మంది ఆదివాసీ రైతులు ఆహారం కోసం ఈ సంప్రదాయ విత్తనాలను తక్కువ విస్తీర్ణంలో సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుత రోజుల్లో మధుమేహం, రక్తపోటు బాధితులు ఆహారం కోసం సూపర్‌మార్కెట్లలో లభించే రెడ్, బ్రౌన్, బ్లాక్ రైస్‌కు అధిక ధర చెల్లించి కొనుగోలు చేసుకుంటున్నారు. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న వివిధ రకాల రైస్ కంటే ఆదివాసీలు పూర్వం సాగు చేసే వరి వంగడాల్లో మానవుల ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో పోషకాలు, ఔషధ గుణాలు ఉన్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ నేప?థ్యంలో అంతరించిపోతున్న ఆదివాసీల సంప్రదాయ వరి విత్తనాలకు పునరుజ్జీవం ఇచ్చేందుకు శాస్త్రవేత్తలు పరిశోధనలు నిర్వహించి విజయం సాధించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి ఉమ్మడి జిల్లా గిరిజన ప్రాంతాల రైతుల నుంచి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు సంప్రదాయ వరి వంగడాలను సేకరించారు. సుమారు 150 మంది రైతుల నుంచి 21 రకాల వంగడాలను సేకరించారు. శాస్త్రవేత్తలకు వంగడాలు అందజేసిన రైతుల వ్యక్తిగత సమాచారం తీసుకున్నారు. ఈ వంగడాలకు ఒక్కొక్క ప్రాంత ఆదివాసీలు ఒక పేరుతో పిలుస్తున్నారు. ఈ మేరకు శాస్త్రవేత్తలు వంగడాలకు నంబర్లు కేటాయించి పరిశోధనలు ప్రారంభించారు. సంప్రదాయ వరి రకాలను 2023 నుంచి మూడేళ్ల పాటు పరిశోధనలు నిర్వహించారు. ప్రయోగాత్మక సాగు తుది ఫలితాలు ఆధారంగా అధిక దిగుబడినిచ్చే వరి రకాల్లో పోషక విలువ, ఔషధ గుణాలు ఆధారంగా మేలిరకం వంగడాలను ఎంపిక చేశారు. మూడేళ్ల ప్రయోగాత్మక సాగులో ఐదు రకాల దేశవాళి వంగడాలు ఆశాజనకంగా ఉన్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. కుంకుమసాలి, తెల్లసన్నాలు, టెంటెంధాన్యం, రత్నచోడి, మైసూర్‌మల్లిక్ మేలిజాతి రకాలుగా ఎంపిక చేశారు. ఈ వంగడాలు హెక్టారుకు 5.5 నుంచి 6.5 క్వింటాళ్ల దిగుబడి ఇస్తాయి.

## అన్ని పార్టీలూ పోష్ చట్టాన్ని వెంటనే అమలు చేయాలి



**అమరావతి, పతాకం న్యూస్:** అన్ని రాజకీయ పార్టీలు, బార్ అసోసియేషన్లు పోష్ చట్టాన్ని అమలు చేయాలని, సిపిఎం ఇప్పటికే ఈ చట్టాన్ని అమలు చేస్తోందని పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి తెలిపారు. మహిళా కమిషన్ ఆధ్వర్యాన నిర్వహించిన రాజకీయ పార్టీల సమావేశానికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎ.వి.నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పోష్ చట్టంలో సవరణలను మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ వివరించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ 2018 నుండి సిపిఎం పోష్ చట్టాన్ని అమలు చేస్తోందని తెలిపారు. విధి విధానాలు రూపొందించిందన్నారు. అప్పటినుండి అఖిల భారత స్థాయిలోనూ రాష్ట్రాల్లోనూ ఇంటర్నల్ కమిటీలు వేశమని పేర్కొన్నారు. కార్యకర్తలకు అవగాహన కల్పించేందుకు శిక్షణా తరగతులు జరపుతున్నామని వివరించారు. సుప్రీంకోర్టు రాజకీయ పార్టీలు న్యాయస్థానాలకు ఈ చట్టం వర్తించదని ఎప్పడం దురదృష్టకరమని, ప్రాథమిక హక్కులను నిరాకరించడం అని తెలిపారు. చట్టం అమలు జరగడం లేదని ఆయా సంస్థల్లో ఏర్పాటు చేసిన కమిటీల గురించి ప్రముఖంగా ప్రదర్శించడం లేదని సంస్థల్లో స్త్రీ పురుషులకు అవగాహన కల్పించడం లేదని పేర్కొన్నారు. ప్రధానంగా కాలేజీల్లో విద్యార్థినులు చాలా పెద్ద ఎత్తున హింస గురవుతున్నప్పటికీ అక్కడా అమలు చేయడం లేదని వివరించారు. పోష్ చట్టం అమలుకు సంబంధించి మహిళా కమిషన్ రాజకీయ పార్టీల సమావేశం ఏర్పాటు చేసేందుకు చేసిన చొరవను సిపిఎం తరుపున అభినందించారు. శాసనసభలో దీని?న చట్ట సవరణ చేయాలని కోరారు. సిపిఎం సెక్రటేరియట్ సభ్యులు నాగేశ్వరరావు మాట్లాడుతూ పోష్ చట్టం అమలు బాధ్యత మహిళలది మాత్రమే కాదని, అందరూ అమలు చేయాలని కోరారు. బిజెపిలో 35 మిలియన్లు, కాంగ్రెస్లో 27 మిలియన్ల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని,అన్ని పార్టీల్లో విస్తృత సంఖ్యలో మహిళలు ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు కూడా కచ్చితంగా అన్ని ప్రాంతాల్లో పోష్ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. అలాగే ఎమ్మెల్యేల క్యాంపు ఆఫీసులు, కమర్షియల్ ప్రాంతాలు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఇలా రకరకాల పేర్లతో ఉన్న వర్కర్లు అందరికీ వర్తింపజేయాలని సూచించారు.

## ముంబైలో మండుతున్న అద్దెలు: సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్‌కు లక్ష దాటిన రెంట్



**ముంబై, పతాకం న్యూస్:** భారత ఆర్థిక రాజధాని ముంబైలో ఇంటి అద్దెలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. 2026లో సింగిల్ బెడ్‌రూమ్ (1దీఎఖ) ఫ్లాట్ల అద్దెలు రికార్డు స్థాయిలో పెరిగి, మధ్యతరగతి వర్గాల ఆదాయానికి, ఇంటి ఖర్చుకు మధ్య వ్యత్యాసాన్ని భారీగా పెంచుతున్నాయి. ముఖ్యంగా ఉద్యోగాల కోసం నగరానికి వచ్చే వారికి సొంత గూడు అనేది అందని ద్రాక్షగా మారుతోంది. రియల్ ఎస్టేట్ అనలిటిక్స్ సంస్థ 'రియల్టీఎక్స్‌టీ' అందించిన వివరాల ప్రకారం ముంబైలోని ప్రాంతాలను బట్టి సింగిల్ బెడ్రూం ఫ్లాట్ అద్దెల్లో భారీ తేడాలు ఉన్నాయి. సబర్బన్ ప్రాంతమైన భాండూప్‌లో నెల అద్దె సుమారు రూ. 28,000 ఉండగా, కొలాబా వంటి ఖరీదైన దక్షిణ ముంబై ప్రాంతాల్లో ఇది ఏకంగా రూ. 1.10 లక్షల వరకు పలుకుతోంది. బాంద్రా, పరేల్, ప్రభాదేవి, మెరైన్ లైన్స్, దాదర్ వంటి ప్రాంతాల్లోనూ అద్దెలు చాలా ఎక్కువగా ఉన్నాయి. అంధేరీ వెస్ట్, గోరేగావ్, ములుంద్, కాందివలి వంటి సబర్బన్ ప్రాంతాల్లో కూడా అద్దెలు గణనీయంగా పెరిగాయి. నగరంలో పెరుగుతున్న ఉద్యోగావకాశాలు, మెరుగైన రవాణా సౌకర్యాలు, డిమాండ్‌కు తగినంతగా ఇళ్ల సరఫరా లేకపోవడం వంటివి అద్దెలు పెరగడానికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. ఆస్తుల ధరలు అధికంగా ఉండటంతో చాలామంది ఇళ్లు కొనడానికి బదులు అద్దెకు ఉండేందుకే మొగ్గు చూపుతున్నారు. దీంతో రెంటల్ మార్కెట్‌పై ఒత్తిడి పెరుగుతోంది. దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే, ముంబైలోనే అద్దెలు అత్యంత ఖరీదైనవిగా ఉన్నాయని మార్కెట్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ అద్దెల పెరుగుదలను నియంత్రించేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి కొత్త ప్రకటనలు రాలేదు. ముంబైలో మధ్యతరగతి ప్రజలు ఈ స్థాయిలో అద్దెలు భరించగలరా అనే అంశంపై సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చ జరుగుతోంది.

## లొంగిపోయిన మావోయిస్టు నరహరి

**హైదరాబాద్, పతాకం న్యూస్:** ప్రస్తుత పరిస్థితుల్లో మావోయిస్టులు చేపట్టిన సాయుధ పోరాటం కష్టంగా మారిందని ఆ పార్టీ కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు పసునూరి నరహరి వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లో మాజీ మావోయిస్టులు నరహరితోపాటు ఆయన భార్య ధనమ్మను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ సమక్షంలో మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా లొంగిపోయిన నరహరి మీడియాతో మాట్లాడుతూ.. జార్ఖండ్, తెలంగాణతోపాటు మిగతా ప్రాంతాల్లో సాయుధ పోరాటం పరంగా అనేక నష్టాలు చేశామని చెప్పారు.

## కాలువ మరమ్మతులకు షార్ట్ టెండర్లు



**అమరావతి, పతాకం న్యూస్:** షార్ట్ టెండర్ల ద్వారా కాలువ మరమ్మతు పనులను పూర్తి చేయాలని జలవనరుల శాఖ నిర్ణయించింది. రూ. పది లక్షల విలువైన పనులను నామినేషన్ పద్ధతిపై సాగునీటి సంఘాల సమాఖ్యలు చేస్తున్నాయి. రూ.10 లక్షల కంటే ఎక్కువ విలువైన పనులు 6502 ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఈ పనులను వానాకాలంలోగా పూర్తి చేయడం ద్వారా ప్రతి ఎకరాకూ నీరందించవచ్చని ఇటీవల నిర్వహించిన సమీక్షలో సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈమేరకు షార్ట్‌టెండర్ (ఏడు రోజుల్లోపు టెండర్ ఖరారు చేసేవి) పిలిచి పనులు అప్పగించాలని జల వనరుల శాఖ నిర్ణయించింది. షార్ట్‌టెండర్ల ద్వారా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశిస్తూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు.

## మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

**సీతంపేట, పతాకం న్యూస్:** బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఐటీడీఏ డిప్యూటీ ఈవో పి. నారాయడు సూచించారు. కుసిమి, సంతమల్లి, దారి మల్లి, మాసడుగూడ గ్రామాల్లో అడ్మిషన్ల డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించి పిల్లల వివరాలను సేకరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు నిండిన పిల్లలను గుర్తించి వారిని ఒకటో తరగతిలో చేర్పిచేందుకు తల్లి దండ్రులకు అవగాహన కల్పించారు. ప్రతి బడిఈడు పిల్లాడు పాఠశాలల్లో చేరి విద్యను కొనసాగించాలని నారాయడు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో ఆనందరావు, మల్లి పాఠశాల హెచ్‌ఎం ఏవీ శ్రీనివాసరావు,ఉపాధ్యాయులు ఎం.రవి పాల్గొన్నారు.



# గర్భధారణ సమయంలో డయాబెటిస్ వస్తే అది దేనికి సంకేతం?



గర్భధారణ సమయంలో వచ్చే గెస్టేషనల్ డయాబెటిస్‌ను చాలా మంది తాత్కాలిక సమస్యగానే భావిస్తారు. సాధారణంగా ప్రసవం తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు మామూలుకు రావడంతో సమస్య ముగిసిపోయిందని అనుకుంటారు. అయితే తాజా అధ్యయనం ప్రకారం ఈ పరిస్థితి భవిష్యత్తులో టైప్-2 డయాబెటిస్ ప్రమాదాన్ని పెంచే సంకేతంగా ఉంటుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా గర్భధారణకు ముందు సాధారణ బరువు ఉన్న మహిళల్లో కూడా ఈ ప్రమాదం కనిపించిందని పరిశోధకులు వెల్లడించారు. స్వీడన్‌లో లక్షలాది మహిళల ఆరోగ్య వివరాలను పరిశీలించిన ఈ అధ్యయనం ఇ-క్లినికల్ మెడిసిన్ జర్నల్‌లో ప్రచురితమైంది. గర్భధారణకు ముందు శరీర బరువు, గెస్టేషనల్ డయాబెటిస్, ఆ తర్వాత టైప్-2 డయాబెటిస్ వచ్చే అవకాశాల మధ్య సంబంధాన్ని పరిశోధకులు విశ్లేషించారు. గర్భధారణ సమయంలో శరీరం ఇన్సులిన్‌ను ఎలా నిర్వహిస్తుందో పరీక్షించే స్ట్రెస్ టెస్ట్ లాంటిదిగా గెస్టేషనల్ డయాబెటిస్ పనిచేస్తుందని అధ్యయనం సూచించింది.

గర్భధారణ సమయంలో రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం భవిష్యత్తులో బయటపడే గ్లూకోజ్ నియంత్రణ సమస్యలకు ముందస్తు సంకేతంగా ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. గెస్టేషనల్ డయాబెటిస్ అంటే గర్భధారణ సమయంలో శరీరం రక్తంలో చక్కెర స్థాయిలను సరిగా నియంత్రించలేకపోవడం. సాధారణంగా ఇన్సులిన్ అనే హార్మోన్ రక్తంలోని చక్కెరను కణాల్లోకి తీసుకెళ్లి శక్తిగా ఉపయోగించేలా చేస్తుంది. కానీ గర్భధారణ సమయంలో ప్లాసెంటా విడుదల చేసే కొన్ని హార్మోన్లు ఇన్సులిన్ ప్రభావాన్ని తగ్గిస్తాయి. అప్పుడు శరీరం తగినంత ఇన్సులిన్ తను యారు చేయలేకపోతే రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. ఈ సమస్య ఉన్న చాలా మంది మహిళల్లో స్పష్టమైన లక్షణాలు కనిపించవు. అందుకే గర్భధారణ సమయంలో చేసే సాధారణ రక్తపరీక్షల ద్వారా దీన్ని గుర్తిస్తారు. ఆహార నియంత్రణ, వ్యాయామం, కొన్ని సందర్భాల్లో మందులు లేదా ఇన్సులిన్‌తో దీనిని నియంత్రించవచ్చు. అయినప్పటికీ ఇది శరీరంలో చక్కెర నియంత్రణ వ్యవస్థపై ఒత్తిడి ఉందనే సంకేతంగా భావిస్తున్నారు.

పరిశోధకులు లక్షకు పైగా తొలి గర్భధారణ కలిగిన మహిళల ఆరోగ్య రికార్డులను పరిశీలించారు. గెస్టేషనల్ డయాబెటిస్ వచ్చిన మహిళల్లో భవిష్యత్తులో టైప్-2 డయాబెటిస్ వచ్చే అవకాశం గణనీయంగా ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ఊబకాయం ఉన్న మహిళల్లో ప్రమాదం అత్యధికంగా కనిపించినప్పటికీ, సాధారణ బరువు ఉన్న మహిళలు కూడా ఈ సమస్య నుంచి పూర్తిగా రక్షణ పొందలేదని అధ్యయనం వెల్లడించింది. అదే బరువు ఉన్న ఇతర మహిళలతో పోలిస్తే గెస్టేషనల్ డయాబెటిస్ వచ్చిన వారిలో ప్రమాదం ఎక్కువగా కనిపించింది. నిపుణుల ప్రకారం గర్భధారణ అనేది భవిష్యత్తు ఆరోగ్య పరిస్థితులను ముందుగానే తెలియజేసే ఒక విండో లాంటిది. ఈ సమయంలో శరీరం అధికంగా పనిచేయాల్సి రావడం, హార్మోన్లలో పెద్ద మార్పులు జరగడం వల్ల ముందుగా గుర్తించని బలహీనతలు బయటపడతాయి.

గర్భధారణ సమయంలో రక్తంలో చక్కెర పెరగడం అంటే ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాలు ఇప్పటికే ఒత్తిడిలో ఉన్నాయని సూచించవచ్చు. ప్రసవం తర్వాత చక్కెర స్థాయిలు మామూలు అయినప్పటికీ, ఇన్సులిన్ రెసిస్టెన్స్‌కు సంబంధించిన ప్రమాదం పూర్తిగా తొలగిపోదు. వయస్సు పెరగడం, జీవనశైలి, జన్యుపరమైన కారణాలు, బరువు పెరగడం వంటి అంశాలు తర్వాత టైప్-2 డయాబెటిస్ ప్రమాదాన్ని మరింత పెంచుతాయి. అందుకే గెస్టేషనల్ డయాబెటిస్‌ను భవిష్యత్తులో వచ్చే ఆరోగ్య సమస్యలకు ముందస్తు హెచ్చరికగా పరిగణిస్తున్నారు. అయితే గెస్టేషనల్ డయాబెటిస్ వచ్చిన ప్రతి మహిళకూ టైప్-2 డయాబెటిస్ వస్తుందని కాదు. ప్రమాదం పెరుగుతుందని మాత్రమే అధ్యయనం చెబుతోంది. ప్రసవం తర్వాత కూడా క్రమం తప్పకుండా రక్తంలో చక్కెర పరీక్షలు చేయించుకోవడం, సమతుల ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం, బరువును నియంత్రణలో ఉంచడం, వైద్యుల పర్యవేక్షణలో ఉండడం ద్వారా భవిష్యత్తు ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. తల్లిపాలు ఇవ్వడం కూడా కొంతవరకు మెటబాలిజం ఆరోగ్యానికి సహాయపడుతుందని పరిశోధకులు చెబుతున్నారు.

## ఇరాన్‌తో ఒప్పందం కుదిరే అవకాశం



**ఇరాన్:** పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న యుద్ధాన్ని అధికారికంగా ముగించేందుకు ఇరాన్‌తో ఒక ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో తెలిపారు. "రాబోయే కొన్ని గంటల్లో ప్రపంచానికి కొన్ని శుభవార్తలు అందే అవకాశం ఉందని నేను భావిస్తున్నాను" అని రూబియో న్యూఢిల్లీలో విలేకరులతో అన్నారు. అయితే, టెహ్రాన్ అణు కార్యక్రమంపై రూబియో చేసిన వ్యాఖ్యలను భారతదేశంలోని ఇరాన్ రాయబార కార్యాలయం తిరస్కరించింది. డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, దిగ్బంధించిన హార్మూజ్ జలసంధిని తెరవడంతో సహా ఒక ప్రతిపాదన "ఎక్కువగా చర్చించింది" అని చెప్పిన తర్వాత, పశ్చిమ ఆసియా యుద్ధాన్ని అధికారికంగా ముగించడానికి అమెరికా, ఇరాన్ ఒక ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ప్రయత్నించాయి. ఒప్పందం వివరాలలో ఇరాన్ అణు ఆయుధాన్ని తయారు చేయదని హామీ ఇచ్చిందని, టెహ్రాన్ తన అధికంగా సుసంపన్నం చేయబడిన యురేనియం నిల్వలను వదులుకోవడానికి అంగీకరించిందని మీడియా కథనాలను ప్రసారం చేసింది. అమెరికా ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనాన్ని ముగించడంతో పాటు హార్మూజ్ జలసంధి క్రమంగా తెరుచుకుంటుందని ఒక అధికారి మీడియాకు తెలిపారు. ఆంక్షల ఉపశమనం, ఇరాన్ స్తంభింపచేసిన నిధులను విడుదల చేయడం 60 రోజుల కాలపరిమితిలో చర్చిస్తుందని వారు చెప్పారు. పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ, ఇరాన్, అమెరికా మధ్య తదుపరి శాంతి చర్చలకు పాకిస్తాన్ త్వరలో ఆతిథ్యం ఇవ్వగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. "పాకిస్తాన్ తన శాంతి ప్రయత్నాలను అత్యంత చిత్తశుద్ధితో కొనసాగిస్తుంది, తదుపరి చర్చలకు త్వరలో ఆతిథ్యం ఇవ్వాలని మేము ఆశిస్తున్నాము" అని షరీఫ్ అన్నారు.? పశ్చిమ ఆసియా యుద్ధాన్ని ముగించడానికి "అమెరికా, ఇరాన్ మధ్య ఒక ఒప్పందం వైపు పురోగతిని" ఇయు చీఫ్ ఉర్సులా వాన్ డెర్ లేయన్ ఆదివారం స్వాగతించారు, అమెరికా అధికారులు త్వరలో ఒక ఒప్పందం ప్రకటించబడవచ్చని చెప్పారు. "సంఘర్షణను నిజంగా తగ్గించే, హార్మూజ్ జలసంధిని తిరిగి తెరిచే, టోల్ రహిత పూర్తి నావిగేషన్ స్వేచ్ఛకు హామీ ఇచ్చే ఒక ఒప్పందం మాకు అవసరం. ఇరాన్ అణు ఆయుధాన్ని అభివృద్ధి చేయడానికి అనుమతించకూడదు" అని యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ సోషల్ మీడియాలో ఆదివారం పోస్ట్ చేశారు.

# సగటు సాధారణమే అయినా.. కొన్నిచోట్ల ప్రతికూలం

## రైతుల్లో తప్పని ఆందోళన



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లాలో నాలుగు మండలాల్లో రైతులను లోటు వర్షపాతం వెంటాడుతోంది. వర్షపాతానికి సంబంధించిన తాజా గణాంకాలను ప్రభుత్వం.. అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈ గణాంకాలను పరిశీలిస్తే.. గతేడాది జూన్ 1 నుంచి ఈ నెల 19 వరకు జిల్లావ్యాప్తంగా సగటున 'సాధారణ' వర్షపాతమే నమోదైనప్పటికీ, మండలాల వారీగా మాత్రం భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. జిల్లాలోని మెజారిటీ ప్రాంతాల్లో వాతావరణం సాగుకు అనుకూలంగా ఉండగా, కొన్ని ప్రాంతాల్లో కుంభవృష్టి, మరికొన్ని ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లావ్యాప్తంగా ఈ వ్యవధిలో 1142.6 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 1134.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణం కంటే కేవలం -0.73 శాతం మాత్రమే తక్కువ. ఇది భూగర్భ జలాల పెంపునకు, తాగునీటి ఎద్దడి నివారణకు సానుకూలంగా మారింది. మూడు మండలాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. సరుబుజ్జిలిలో అత్యధికంగా 25.81 శాతం వర్షపాతం (1,037.4 మి.మీకి గాను 1,305.2 మి.మీ) నమోదైంది. రణస్థలంలో 25.39 శాతం అధికంగా (108.8 మి.మీకి గాను 1277.5 మి.మీ), మందసలో 23.88 శాతం అధికంగా (1202.1 మి.మీకి గాను 1489.2 మి.మీ) వర్షపాతం నమోదైంది.

శ్రీకాకుళం, ఆమదాలవలస, బూర్జ, ఎచ్చెర్ల, జి.(గంగువారి) సిగడాం, గార, హిరమండలం, జలుమూరు, కోటబొమ్మాళి, లావేరు, మెళియాపుట్టి, నందిగాం, నరసన్నపేట, పలాస, పాతపట్నం, పోలాకి, పొందూరు, సంతబొమ్మాళి, సారవకోట, సోంపేట, టెక్కలి, వజ్రపుకొత్తూరు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్లు ప్రభుత్వ వెబ్‌సైట్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లా సగటు సానుకూలంగా ఉన్నా, నాలుగు మండలాల్లో మాత్రం 'లోటు' వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కవిటిలో -27.11 శాతం లోటు నమోదైంది. ఇక్కడ 1303.9 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, కేవలం 950.4 మి.మీ మాత్రమే కురిసింది. కొత్తూరులో -25.32 శాతం లోటు వర్షపాతం (1232.4 మి.మీకి గాను 920.3 మి.మీ) నమోదైంది. ఇచ్ఛాపురంలో - 24.73 శాతం లోటుతో (896.7 మి.మీకి గాను 686.43 మి.మీ) వర్షాలు ముఖం చాటేశాయి. కంచిలిలో -20.77 శాతం లోటు వర్షపాతం (1261.8 మి.మీకి గాను 999.7 మి.మీ) నమోదైంది. ఈ లోటు.. ఆయా ప్రాంతాల్లోని రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.గత నెలలో 29 మి.మీ సాధారణ వర్షపాతానికి గాను 22.02 మి.మీ కురిసి పర్వాలేదనిపించినా, ఈ నెల ఆరంభం మాత్రం రైతులను తీవ్ర నిరాశకు గురిచేసింది. జిల్లాలో ఈ నెల 1 నుంచి 19 వరకు 102.43 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, కేవలం 22.17 మి.మీ మాత్రమే నమోదైంది. ఇది ఖరీఫ్ సన్నాహక పనులకు, నారుమడులకు సిద్ధమవుతున్న రైతులకు కొంత ప్రతికూలంగా మారింది. ఈ నెలలో వర్షాలు తగ్గడం, నాలుగు మండలాల్లో లోటు వర్షపాతం దృష్ట్యా వ్యవసాయ శాఖ అధికారులు ఆయా ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ప్రణాళికలతో రైతులను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉంది.




## ఫైనల్‌లో బెర్త్ కోసం..

# గుజరాత్‌తో బెంగళూరు ఢీ



ఆసక్తికరంగా సాగిన ఐపీఎల్-19 సీజన్ లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాయి. ప్లేఆఫ్స్‌లో చోటు కోసం ప్రతీ జట్టు హోరాహోరీగా తలపడడంతో చివరి మ్యాచ్ వరకు స్పష్టత రాకపోవడం గమనార్హం. ఇక నేటి నుంచి అసలైన సమరం ఆరంభం కానుంది. టైటిల్‌ను దక్కించుకునేందుకు టాప్-4 జట్ల మధ్య క్వాలిఫయర్స్, ఎలిమినేటర్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఇందులో భాగంగా ధర్మశాలలో జరిగే తొలి క్వాలిఫయర్ 1లో మంగళవారం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు-గుజరాత్ టైటాన్స్ జట్లు తలపడనున్నాయి. ఇందులో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు వెళుతుంది. ఓడిన జట్టు ఎలిమినేటర్ (రాజస్థాన్-సన్‌రైజర్స్) విజేతతో జరిగే రెండో క్వాలిఫయర్‌లో అమీతుమీ తేల్చుకోనుంది. ఆర్‌సీబీ-టైటాన్స్ రెండూ 9 విజయాలు, 5 ఓటములు 18 పాయింట్లతో సమానంగానే ఉన్నాయి. కానీ స్వల్ప నెట్‌రన్‌రేట్ తేడాతో ఆర్‌సీబీ టాపర్‌గా నిలిచింది. మరోవైపు ధర్మశాలలో గుజరాత్ జట్టు తమ కెరీర్‌లో తొలిసారిగా బరిలోకి దిగబోతోంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగంలో పటిష్టంగా కనిపిస్తున్న ఆర్‌సీబీని ఓపెనింగ్ సమస్య వెంటాడుతోంది. ఆరంభంలో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఫిల్ సాల్ట్ రెండు హాఫ్ సెంచరీలతో 202 పరుగులు చేశాడు. అయితే గాయంతో మిగిలిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. దీంతో అతడి స్థానంలో బరిలోకి దిగిన బెథెల్ ఏడు మ్యాచ్‌ల్లో కేవలం 96 పరుగులే సాధించి దారుణంగా విఫలమయ్యాడు. అయితే ఇటీవలే జట్టులో చేరిన సాల్ట్ కీలక క్వాలిఫయర్1కు ఫిట్‌గా ఉంటే సమస్య తీరినట్టే. సన్‌రైజర్స్‌పై విరాట్‌తో కలిసి ఆడిన వెంకటేశ్ అయ్యర్ 19 బంతుల్లో 44 రన్స్ చేశాడు. ఒకవేళ సాల్ట్ ఆడలేకపోతే అయ్యర్‌నే ఓపెనర్‌గా కొనసాగించవచ్చు. పైగా ఈనెల 17న ఇక్కడ ఆడిన మ్యాచ్‌లో తను 73 రన్స్‌తో నాటౌట్‌గా నిలిచి భారీ స్కోరుకు కారణమయ్యాడు. ఇక విరాట్ 157.83 స్ట్రయిక్ రేట్‌తో 554 పరుగులు సాధించి ఊపు మీదున్నాడు. దేవ్‌దత్, రజత్, టిమ్ డేవిడ్, క్రునాల్‌లతో కూడిన బ్యాటింగ్ లైనప్ అత్యంత పటిష్టంగా ఉంది. ఇక బౌలింగ్‌లో భువనేశ్వర్, హాజెల్‌వుడ్, రసిఖ్‌లతో పేస్ త్రయం ప్రత్యర్థిని ఇబ్బందిపెట్టగలదు. భువీ ఇప్పటికే 24 వికెట్లు తీయడం విశేషం. గుజరాత్ టైటాన్స్ బలమంతా ఓపెనర్లు సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ ఆటతీరుపైనే ఉందనడంలో సందేహం లేదు. అద్భుతమైన నిలకడతో వీరిద్దరు ఈ సీజన్‌లో 600ం చొప్పున రన్స్‌తో అదరగొడుతున్న విషయం తెలిసిందే. అందుకే ఈ జోడీ ఐపీఎల్‌లోనే బెస్ట్ అంటూ మాజీలు కితాబిస్తున్నారు. ఆడిన 46 ఇన్నింగ్స్‌లో 21సార్లు 50ం భాగస్వామ్యాలు నమోదు చేయడం విశేషం. ఇక నేటి పోరులోనూ వీరే కీలకం కానున్నారు. ఇక వన్‌డౌన్ బ్యాటర్ బట్లర్, సుందర్‌ల ఎదురుదాడితో భారీ స్కోరుపై టైటాన్స్ కన్నేసింది. ఆల్‌రౌండర్ జేసన్ హోల్డర్ రాకతో జట్టుకు విజయాలు పెరిగాయి. పేసర్లు రబాడ, సిరాజ్, ప్రసిద్ధ్ ఒత్తిడి పెంచుతున్నారు. ఇక స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ మధ్య ఓవర్లలో ఆర్‌సీబీని కట్టడి చేయాలనుకుంటున్నాడు.

**బెంగళూరు:** విరాట్ కోహ్లీ, సాల్ట్/వెంకటేశ్ అయ్యర్, దేవ్‌దత్, రజత్ పటీదార్ (కెప్టెన్), జితేశ్ శర్మ, షెఫర్డ్, టిమ్ డేవిడ్, క్రునాల్, భువనేశ్వర్, హాజెల్‌వుడ్, రసిఖ్ సలామ్.

**గుజరాత్:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), సాయి సుదర్శన్, బట్లర్, వాషింగ్టన్ సుందర్, హోల్డర్, తెవాటియా, నిశాంత్ సింధు, రషీద్ ఖాన్, అర్షద్ ఖాన్, రబాడ, సిరాజ్.

## హార్దిక్ పాండ్య కెప్టెన్సీపై విమర్శలు



ఐపీఎల్ 2026 నుంచి ముంబై ఇండియన్స్ ముందుగానే నిష్క్రమించడంతో హార్దిక్ పాండ్య కెప్టెన్సీపై విమర్శలు వ్యక్తమయ్యాయి. వచ్చే సీజన్‌లో ఈ ఆల్‌రౌండర్ జట్టుకు నాయకత్వం వహించకూడదని కొంతమంది క్రీడా నిపుణులు, అభిమానులు సూచిస్తున్నారు. ఈ సీజన్‌లో అతను 8 ఇన్నింగ్స్‌ల్లో కేవలం 146 పరుగులు చేసి.. 3 వికెట్లు మాత్రమే తీశాడు. వచ్చే ఏడాది హార్దిక్ ఎంఐ కెప్టెన్‌గా కొనసాగడం తనకు ఇష్టంలేదంటూ భారత మాజీ బ్యాటర్ వసీం జాఫర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే పాండ్య వ్యక్తిగత ఆటపై దృష్టి పెట్టేందుకు ఫ్రాంచైజీ అతన్ని తప్పకుండా జట్టులో కొనసాగించాలని పేర్కొన్నాడు. జాఫర్ తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ.. 'నేను అతడిని కెప్టెన్‌గా చేయను, కానీ జట్టులో తప్పకుండా కొనసాగిస్తాను. అతను మరింతగా రాణించి, తనలోని అత్యుత్తమ ప్రతిభను వెలికితీయాలని నేను కోరుకుంటున్నాను' అని అన్నాడు. అలానే హార్దిక్ స్థానంలో కెప్టెన్‌గా ఎవరిని నియమిస్తారని అడగ్గా.. 'ప్రస్తుత పరిస్థితుల్లో కెప్టెన్‌ను ఎంపిక చేయడం కష్టం' అని జాఫర్ సమాధానం ఇచ్చాడు. ఈ సీజన్ తమ చివరి లీగ్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో 30 పరుగుల తేడాతో ఓటమి పాలైన ముంబై ఇండియన్స్.. పాయింట్ల పట్టికలో నిరాశాజనకంగా తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకుంది. పాయింట్లతో పట్టికలో తొమ్మిదో స్థానంలో నిలిచినప్పటికీ కెప్టెన్ హార్దిక్‌పై ఎటువంటి నిందలు వేయడం జరగదని ముంబై ఇండియన్స్ బ్యాటింగ్ కోచ్ కీరన్ పొలార్డ్ స్పష్టం చేశారు. నాయకత్వ కోణం నుంచి చూస్తే, హార్దిక్ వ్యక్తిగతంగా ఆశించిన స్థాయిలో రాణించలేదని పొలార్డ్ విలేకరులతో అన్నారు. 'యాజమాన్య సిబ్బందిగా మేము కోరుకున్నట్లుగా జరగకపోయి ఉండవచ్చు. ఫ్రాంచైజీకి నాయకత్వం వహించడానికి, అతడు రాణించడానికి మేము అన్ని విధాలుగా ప్రయత్నించాము. ఈ సీజన్‌లో ముంబై ఇండియన్స్ విఫలమనేది.. కేవలం ఏ ఒక్క వ్యక్తి తప్పిదం కాదు. తమ ఫ్రాంచైజీ సామూహిక వైఫల్యం' అని పొలార్డ్ అన్నారు.




# జూన్ 19న 'మా ఇంటి బంగారం'



స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటిస్తూ, నిర్మాతగానూ వ్యవహరిస్తున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. ప్రముఖ దర్శకురాలు నందినీ రెడ్డి తెరకెక్కించిన ఈ సినిమాను జూన్ 19న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమంత మాట్లాడుతూ, ఈ సినిమా అభిమానులు గర్వపడేలా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సమంత మాట్లాడుతూ.. "'మా ఇంటి బంగారం' ట్రైలర్ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను. మా కోసం వచ్చిన అభిమానులందరికీ ధన్యవాదాలు. దర్శకురాలు నందినీ రెడ్డి, నిర్మాత రాజ్ నిడిమోరు ప్రతీ విషయంలో చాలా పర్ఫెక్ట్‌గా ఉంటారు. వారితో నాకు ఇప్పటివరకు ఎలాంటి భేదాభిప్రాయాలు రాలేదు. ఈ సినిమాలో యాక్షన్, డ్రామా, కామెడీతో పాటు అన్ని రకాల భావోద్వేగాలు ఉంటాయి. ఇది ఒక కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అలరిస్తుంది. జూన్ 19న అందరూ సినిమా చూసి ఆనందించండి" అని అన్నారు. దర్శకురాలు నందినీ రెడ్డి మాట్లాడుతూ.. "సమంత నటిగా ఎంతో ఎదిగారు. ఒకప్పటి సమంతకు, ఇప్పటి సమంతకు చాలా తేడా ఉంది. ఆమె నటన ఇప్పుడు నెక్స్ట్ లెవెల్‌లో ఉంది. యాక్షన్, కామెడీ, ఎమోషన్.. ఇలా ప్రతీ సన్నివేశంలో అదరగొట్టేశారు. నేను కూడా ఒక అభిమానిలాగే మానిటర్ ముందు కూర్చుని ఆమె నటనను ఆస్వాదించాను. ఈ సినిమా కచ్చితంగా బ్లాస్ట్ అవుతుంది. అందరినీ ఆకట్టు కుంటుంది" అని తెలిపారు. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై సమంతతో పాటు రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు ఈ చిత్రాన్ని నిర్మించారు. నిర్మాత రాజ్ నిడిమోరు మాట్లాడుతూ.. "'మా ఇంటి బంగారం' అనే పేరులో ప్రేమ, ఆప్యాయత కనిపిస్తాయి. కానీ దాని వెనుక ఒక డార్క్ సైడ్, పొసెసివ్‌నెస్ కూడా ఉంది. సమంత, నందినీ రెడ్డి మధ్య ఉన్న బాండింగ్ వల్లే ఈ ప్రాజెక్ట్ సాధ్యమైంది" అని వివరించారు. మరో నిర్మాత హిమాంక్ దువ్వూరు మాట్లాడుతూ, నటిగా, నిర్మాతగా సమంత వందకు వంద మార్కులు సంపాదించుకున్నారని ప్రశంసించారు. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన శ్రీముఖి మాట్లాడుతూ.. "సమంత హీరోయిన్ అనగానే కథ వినకుండానే ఓకే చెప్పాను. ఆమె నిజంగానే బంగారం. ఈ చిత్రంలో ఆమె నవ్విస్తారు, ఏడిపిస్తారు, ఫైట్స్ కూడా చేస్తారు" అని అన్నారు. నటుడు శ్రీనివాస్ గవిరెడ్డి మాట్లాడుతూ.. "జూన్ 19న థియేటర్లలో ప్రేక్షకులు గన్ పవర్, గాజుల పవర్ రెండూ చూస్తారు" అని వ్యాఖ్యానించారు. ఈ చిత్రంలో దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి, ఆనంద్, లక్ష్మీ, మంజూష తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందించగా, ఓం ప్రకాష్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు.

# 28న 'బ్లాస్ట్ జోన్'



మహిళా సాధికారతకు ప్రాధాన్యమిస్తూ అర్జున్ సర్జా, ప్రీతి ముకుందన్, అభిరామి ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'బ్లాస్ట్ జోన్'. సుభాశ్ కె రాజ్ దర్శకత్వంలో ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ దీనిని నిర్మించింది. నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో ఈనెల 28న విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో అర్జున్ సర్జా మాట్లాడుతూ 'ఈ 'బ్లాస్ట్ జోన్' సినిమా నాకు ఎంతో ప్రత్యేకమైనది. మనవాళ్లకు అన్యాయం జరిగితే మనం కచ్చితంగా పోరాడతాం. అయితే ఈ సమాజంలో ఎవరికి అన్యాయం జరిగినా పోరాడాలి అనే సందేశాన్ని ఈ సినిమా ఇస్తుంది. ఎవరో వచ్చి మనల్ని కాపాడతారు అని ఎదురు చూడకుండా, మనల్ని మనం కాపాడుకోవడానికి ఏం చేయాలి? తల్లిదండ్రులుగా ఆడబిడ్డల్లో ధైర్యం ఎలా నింపాలి? వంటి అద్భుతమైన అంశాలను ఈ చిత్రంలో చర్చించాం.మహిళా సాధికారతకు కమర్షియల్ అంశాలు జోడించి చేసిన గొప్ప చిత్రమిది' అని అన్నారు. అభిరామి మాట్లాడుతూ 'ఇదో మాస్ మసాలా ఫిల్మ్. విజువల్స్, మ్యూజిక్, స్టంట్స్ అద్భుతంగా ఉంటాయి' అని చెప్పారు. 'మీ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా ఈ సినిమా ఉంటుంది' అని చిత్ర దర్శకుడు సుభాశ్ కె రాజ్ అన్నారు.

# ఐమ్యాక్స్ ఫార్మెట్‌లో 'జైలర్-2'



నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా నటించిన 'జైలర్-2' మూవీలోని పలు సన్నివేశాలను ఐమ్యాక్స్ ఫార్మెట్‌లోనే చిత్రీకరించినట్టు సమాచారం. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమాకు సంబంధించి వచ్చే ప్రతి అప్‌డేట్ ప్రేక్షకుల్లో అమితాసక్తిని రేపుతోంది. సాధారణంగా ఒక సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఐమ్యాక్స్ ఫార్మెట్‌లోకి మారుస్తారు. కానీ, 'జైలర్-2' మూవీ మాత్రం చిత్రీకరణ దశలోనే పలు కీలక సన్నివేశాలను ఐమ్యాక్స్ ఫార్మెట్‌లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చిత్రీకరించారు. సినిమా ఫెస్టివల్ సమాచారం

సెప్టెంబరులో ప్రేక్షకుల ముందుకురానున్న ఈ చిత్రంలో రజనీకాంత్, రమ్యకృష్ణ, మిర్ణా, శివరాజ్ కుమార్, మోహన్‌లాల్ తదితరులు నటించారు. గతంలో విడుదలైన ఈ సినిమా తొలిభాగం బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన విషయం తెల్సిందే. సన్ పిక్చర్స్ పతాకంపై నిర్మాత కళానిధి మారన్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**